**రిపోర్టర్లు కావలెను**

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న 'జర్నలిస్ట్ ఫైల్' దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం : 9502535152, 7416812467

శనివారం 01.06.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -130 www.journalistfile.com పేజీలు 6 వెల : రూ.5.00



## ఈచావులకు బాధ్యులెవరు ?

- **కలుషిత నీటితో వరుసపెట్టి పోతున్న ప్రాణాలు**
- **దున్నపోతు నిద్రలో అధికార యంత్రాంగం**

**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** విజయవాడలో కలుషిత నీటి వల్ల డయేరియా కేసులు భారీగా పెరుగుతున్నాయి. ఇప్పటికే ఏడుగురు మరణించగా.. అధికారులు, పాలకుల అలసత్వంతో కలుషిత నీటి తాగుతూ అనేక మంది ఆసుపత్రులపాలవుతున్నారు. బాధితుల్లో నిరుపేదలే ఎక్కువగా ఉన్నారు. సంవత్సరం లోపు వయసున్న పిల్లలు సైతం డయేరియా బాధితులలో ఉన్నారు. కలుషిత నీరు పైప్‌లైన్లలో కలుస్తున్నా.. వీఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని నగర వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో కనీస వైద్య సేవలు అందించడం లేదని ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. 64వ డివిజన్ ప్రజాశక్తి నగర్, రాధానగర్ లో మరిన్ని అతిసార కేసులు వస్తున్నాయని, ప్రభుత్వ, వివిధ ప్రైవేట్ ఆస్పత్రులలో, మరికొందరు ఇళ్ల వద్ద చికిత్స పొందుతున్నారు. తమ దుస్థితిపై ప్రజలు పదే పదే విజ్ఞప్తి చేసినప్పటికీ అధికార యంత్రాంగం స్పందించడం లేదు.. కనీసం వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేయకపోవడం విచారకరమని ప్రజలు మండిపడుతున్నారు

కాగా, వాంతులు, విరోచనాలతో విజయవాడలో మరొకరు మృతి చెందారు. పాయికాపురం 64వ డివిజన్ రాధానగర్ లో చౌదరి కనకమ్మ(60 సం.రాలు) వాంతులు, విరోచనాలతో గురువారం రాత్రి ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందారు. ఈ సమాచారాన్ని నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ ఆఫీసర్, ఇతర అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ స్పందన శూన్యం.

**నీటి శుద్ధి పై నిర్లక్ష్యం**

పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్న నీటి శుద్ధిపై కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని నగరవాసులు ఆరోపిస్తున్నారు. వాటర్ ట్యాంకులు పాకుడుపట్టి ఉన్నాయని చెబుతున్నారు. ప్రకాశం బ్యారేజీ దగ్గర కేవలం ఏడు అడుగుల లోతులోనే నీరు ఉండటంతో ఇంటేక్ వెల్‌లోకి మొత్తం బురద నీరు వెళుతుంది.. ఈ నీటిని పలు దశల్లో క్లీన్ చేయాల్సింది పోయి.. అరకొర వాటర్ ట్రీట్‌మెంట్‌తో నేరుగా పంపింగ్ చేసేస్తున్నారని

2 లో



## యూనిఫాం పవర్

## ఏమిటో చూపిస్తా

### పల్నాడు ఎస్పీ వార్నింగ్

**పల్నాడు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** దేశం మొత్తం నవ్వుకునేలా పల్నాడు జిల్లా పరువుతీశారని, ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలతో పల్నాడు పరువు పోయిందని ఎస్పీ మల్లికా గార్గ్ అన్నారు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పల్నాడు జిల్లా వినుకొండలో వందలాదిమంది పోలీసులు, కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే పల్నాడు వరస్ట్ జిల్లా అనే ముద్ర పడిందని, దేశంలోనే ఆ పేరు వచ్చి ఉండొచ్చన్నారు. ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలు మళ్లీ జరగనివ్వబోమని స్పష్టం చేశారు. పల్నాడు పేరు చెడగొట్టారని, పల్నాడు ప్రజలంటే కర్రలు, ఇనుపరాడ్లు పట్టుకొని రోడ్ల మీద తిరుగుతారని దేశమంతటా ప్రచారమైందని ఇలాంటి ఘటనలకు కారణమైనవారిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. మాచర్ల, నరసరావుపేటల్లో జరిగిన గొడవలు దేశమంతటా మార్మోగాయని మలికా గార్గ్ ఆవేదన వ్యక్తం చేశారు. పల్నాడు జిల్లాలో జరిగిన ఘర్షణలతో ఇక్కడ ఏమి జరుగుతోందని దేశమంతటా గమనిస్తోందని, తన బ్యాచ్‌మేట్స్, కుటుంబ సభ్యులు, స్నేహితులు పల్నాడు ఫ్యాక్షన్ గురించే అడుగుతున్నారని రాష్ట్రంలో అత్యంత దారుణమైన పరిస్థితులు ఇక్కడ ఉన్నాయన్నారు. పది రోజుల వ్యవధిలో 160 కేసులు నమోదు కావడాన్ని ఏ పోలీస్ అధికారి కోరుకోరన్నారు. పల్నాడు తర్వాత స్థానంలో ఉన్న జిల్లాలో 70కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఏ స్థాయిలో పల్నాడులో ఘర్షణలు జరిగాయో అర్థం చేసుకోవాలన్నారు.

**యూనిఫాం పవర్ ఏమిటో చూస్తారు : ఎస్పీ వార్నింగ్**

ఘర్షణల కేసుల్లో ఇప్పటి వరకు 1300 మందిని అరెస్టు చేశామని, 400 మందిపై రౌడీషీట్లు తెరిచినట్టు ఎస్పీ ప్రకటించారు. పల్నాడు అల్లర్లలో నిందితుల్ని పెట్టేందుకు జైళ్లు సరిపోక రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పంపిస్తున్నట్లు చెప్పారు. గొడవల్లో జైళ్లకు వెళుతున్న వారంతా సామాన్యులేనని, నాయకులు మాత్రం డబ్బు, తెలివి తేటలతో బెయిల్ తెచ్చుకుని బయట తిరుగుతున్నారన్నారు. గొడవల్లో బలవుతున్నది సామాన్య ప్రజలేనని, నాయకుల కోసం మీ జీవితాలు పాడు చేసుకోవద్దని సూచించారు. కౌంటింగ్ రోజు ఎవరైనా తోక జాడిస్తే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందని, యూనిఫాం పవర్ ఏమిటో చూస్తారని వార్నింగ్ ఇచ్చారు.

## చట్టాన్ని మీరి ఎలక్షన్ కమిషన్ ప్రవర్తిస్తోంది

- **మాజీ మంత్రి పేర్ని నాని**



**మచిలీపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎన్నికల సంఘం వ్యవహారంపై మాజీ మంత్రి పేర్ని నాని హాట్ కామెంట్స్ చేశారు. రాష్ట్ర ఎన్నికల నిర్వహణ ముఖ్య అధికారి, కేంద్ర ఎన్నికల సంఘం అందరూ కేంద్రం ఒత్తిడికి లొంగి పని చేస్తున్నారని గత కొంత కాలంగా మేము ఆరోపిస్తున్నామన్నారు. టీడీపీ చేస్తున్న తప్పులను ఎత్తి చూపిస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. టీడీపీ అనుకూల మీడియాలో వార్త వస్తే చాలు కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. టీడీపీ, బీజేపీ నేతలపై కేసులు పెట్టొద్దని కలెక్టర్లు, ఆర్వోలను బెదిరిస్తున్నారని పేర్నినాని ఆరోపించారు. సాధ్యమైనంత వరకు వైసీపీపై ఎక్కువ కేసులు పెట్టాలని ఆదేశాలు ఇస్తున్నారని చెప్పారు.

"ఫోరమ్ 12ఏ అనేది ఎక్కడ నుండి వచ్చింది? అని ఆయన ప్రశ్నించారు. 13 ఎ, 13 బీ పోస్టల్ బ్యాలెట్లు ఇస్తారు. దానికి గెజిటెడ్ ఆఫీసర్ సర్టిఫికెట్ ఇస్తారు. స్టాంప్ వేయకపోయినా, డిజిగ్నేషన్ లేకపోయినా పర్లేదని సర్క్యులర్ ఇచ్చారు. మచిలీపట్నంలో 4వేల మంది పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకున్నారు. వారిలో ఇతర ప్రాంతాల వారు సైతం ఉన్నారు. చట్టాన్ని మీరి ఎలక్షన్ కమిషన్ ప్రవర్తిస్తుంది.

మేము ఈ సమస్యను ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లగా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తే కోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేశాము. దేశంలో ఏ రాష్ట్రంలో లేని రూల్స్ ఆంధ్రప్రదేశ్ లో అమలు చేస్తున్నారు. నేను ఇచ్చిన మెమో వెనక్కి తీసుకుంటాను అని ఏపీ సీఈవో ముకేశ్ కుమార్ మీనా అంటున్నారు. అంటే, ఆయన తప్పు చేశాను అని ఒప్పుకున్నట్లేగా. కచ్చితంగా న్యాయమే గెలిచి తీరుతుంది. టీడీపీ, బీజేపీ చట్టాలను చుట్టాలుగా చేసుకుని వ్యవహరిస్తున్నారు" అని మండిపడ్డారు పేర్నినాని.

## మా భూములు లాక్కోవడంలో సీఎస్ జవహర్ రెడ్డి హస్తం

**విశాఖ ప్రాంతానికి చెందిన రైతుల ఆవేదన**



**విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** సీఎస్ జవహర్ రెడ్డి స్వయంగా వచ్చి తమ భూములను పరిశీలించారని విశాఖ ప్రాంతానికి చెందిన పలువురు రైతులు తెలిపారు. 40 ఏళ్లుగా భూములు సాగుచేసుకుంటున్నట్లు చెప్పామన్నారు. చావనైనా చస్తామని.. భూములు మాత్రం ఇవ్వబోమని

2 లో

## అన్యాయాన్ని ఎదురిస్తూనే ఉంటా..

- **ఏబీ వెంకటేశ్వరరావు**



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కమిషనర్ హోదాలో పదవీ విరమణ చేశారు. విజయవాడలోని ప్రింటింగ్ అండ్ స్టేషనరీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ప్రముఖులు ఏబీవీని కలిసి శు

2 లో



## కౌంటింగ్ కు పకడ్బందీ ఏర్పాట్లు

- అడుగడుగునా బలగాలు, కౌంటింగ్ కేంద్రాల దగ్గర 144 సెక్షన్
- రాష్ట్ర వ్యాప్తంగా కార్డన్ సెర్చ్
- రికార్డు స్థాయిలో కేంద్ర బలగాల మోహరింపు

2 లో



## పోస్టల్ బ్యాలెట్ అంటే వైసీపీకి ఎందుకు భయం..?

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్ ):** పోస్టల్ బ్యాలెట్ అంటే వైసీపీ నేతలు ఎందుకు అంతగా భయపడుతున్నారో అర్థం కావడంలేదని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్ బాబు తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. "గురువారం హైకోర్టులో వైసీపీ పార్టీ తరపున సీఈఓ ఆంధ్రప్రదేశ్ ఇచ్చిన ఒక వివరణ మీద వైసీపీవారు రిట్ ఫైల్ వేశారు. వైసీపీవారు కేసును విత్ డ్రా చేసుకునే పరిస్థితి వచ్చింది, అది చెప్పకుండా సీఐఓ మేము ఒక మెమోని విత్ డ్రా చేసుకుంటున్నామని చెప్పారు. వైసీపీ దాన్ని హైలెట్ చేస్తోంది. అదేదో పెద్ద విజయం సాధించినట్లు చెప్పుకుంటున్నారు. సీఈఓ ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీకి ఫేవర్ గా చేసినట్లు చెప్పుకుంటున్నారు. ఇలా వివిధ రకాలుగా వారి బ్లూ మీడియాలో రాసుకున్నారు. ప్రజలకు వాస్తవాలు తెలియాలి. కేంద్ర ఎన్నికల కమిషనర్ పోస్టల్ బ్యాలెట్ లో ఓటేసినపుడు 13 ఏ డిక్లరేషన్ ఇవ్వాలని 19.07.2023లోనే సర్క్యులర్ ఇచ్చారు. అందులో గెజిటెడ్ ఆఫీసర్ సతకం పెట్టాలి. పోలు జరిగిన ఫెలిసేట్ సెంటర్ వద్ద గెజిటెడ్ ఆఫీసర్ ఉండాలి. ఆయనే సంతకం పెట్టి స్టాంప్, సీల్ వేసి ఇవ్వాలి. ఇది ప్రభుత్వ బాధ్యత. ఎక్కడైన పొరపాటున స్టాంప్, సీల్ లేకపోయినా అటువంటి బ్యాలెట్స్ ని తిరస్కరించొద్దని వ్యాలిడ్ లోకి తీసుకొని కౌంట్ చేయాలని 2023లోనే కేంద్ర ఎన్నికల కమిషనర్ సర్క్యులర్ ఇచ్చారు. నేడు దాన్ని ఉటంకిస్తూ 25.07.2024వ తేదిన ఏపీ సీఈఓ పోస్టల్ బ్యాలెట్ ని మేం రిజెక్ట్ చేయము అని స్పష్టంగా సర్క్యులర్ ఇచ్చారు.

గత యేడాది 2లక్షల 68 వేల పోస్టల్ బ్యాలెట్స్ లో అనేక కారణాలతో దాదాపు 56 వేల పోస్టల్ బ్యాలెట్స్ ఇన్ వ్యాల్యుడ్ అయ్యాయి. ఇన్ వ్యాల్యుడ్ అనేది ప్రజాస్వామ్యంలో మంచి పద్ధతి కాదు. ఇటువంటి చిన్న చిన్న వాటిని సర్దుబాటు చేయమని మేం అడిగాం. దాన్ని కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్లు ఒప్పుకున్నాయి. ఇంత జరిగాక ఎందుకు వైసీపీ గోల చేస్తోందో అర్థం కావటంలేదు. వైసీపీ దుష్ప్రచారం వారి దిగజారుడుతనానికి నిదర్శనం ఏదేమైనా స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఒకవేళ ఏదైనా ఇబ్బంది ఉంటే ఖచ్చితంగా దీని మీద మళ్లీ మేము కేంద్ర ఎన్నికల కమిషన్ ను కలిసి ఎన్నికల కమిషన్ ఏదైతే వివరణ ఇచ్చిందో ఆ వివరణను అమలు చేయాలని కోరనున్నాం. చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు. వైసీపీ వారు ఉక్రోషంతో ఇటువంటి లిటికేషన్స్ తయారు చేస్తున్నారు. కన్ఫ్యూజన్ క్రియేట్ చేస్తున్నారని" ఎమ్మెల్సీ అశోక్ బాబు తెలిపారు.



## కమిషనర్ గారి కబుర్లు

### నీరు కలుషితం కాలేదట.. అవి అనారోగ్య మరణాలట..!

విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) : మొగల్రాజపురంలో డయేరియాతో నలుగురు మృతి చెందారు. మరో 100 మందికి పైగా ఆస్పత్రి పాలయ్యారు. ప్రధానంగా మంచి నీరు కలుషితం కావడం వల్లే మొగల్రాజపురం వాసులు అస్వస్థతకు గురయ్యారనే ఆరోపణలు వినిపించాయి. ఈ ఆరోపణలపై విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దికర్ స్పందించారు. రోహిణి కార్తె మండే ఎండల్లో చల్లని ఏసీ కింద కూర్చుని ... భారం దించేసుకునే కబుర్లు చెప్పారు కమిషనర్ గారు.

తాగునీరు కాలుషితం కావడమనేది అవాస్తమని చెప్పారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సురక్షిత నీటిని ప్రజలకు సరఫరా చేస్తోందన్నారు. మంచినీరు తాగి ఎవరూ మృతి చెందలేదని తెలిపారు. అనారోగ్యంతోనే నలుగురు మృతి చెందారని స్పష్టం చేశారు. మొగల్రాజపురంలో నీరు కలుషితమైనట్లు తమకు ఫిర్యాదు వచ్చాయని తెలిపారు. మూడు రకాల పరీక్షలు చేశామని, ఎక్కడా హానికరం లేదని రిపోర్టు వచ్చిందని దినకర్ తెలిపారు. మొగల్రాజపురంలో ప్రతి ఇంటికి వెళ్లి హెల్త్ సర్వే చేశామన్నారు. నీళ్లలో కోరిన్ కలిపినప్పుడు రంగు మారుతుందని చెప్పారు. పైప్ లైన్ లీకేజీలు సహజమేనని, వాటిని గుర్తించి చర్యలు చేపట్టామని విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పేర్కొన్నారు.

# జస్టిస్ ఎవి శేష సాయి సేవలు ప్రసంశనీయం

## హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో న్యాయమూర్తిగా జస్టిస్ ఎవి శేష సాయి అందించిన సేవలు ప్రసంశ నీయమైనవని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయమూర్తిగా సేవలు అందిస్తున్న జస్టిస్ ఎవి శేష సాయి పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో శుక్రవారం హైకోర్టు మొదటి కోర్టు హాల్లో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం జరిగింది. ఈ వీడ్కోలు కార్యక్రమంలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషసాయి సేవలను ప్రత్యేకంగా కొనియాడారు. 1962లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో సామాన్య కుటుంబంలో పుట్టిన జస్టిస్ శేషసాయి భీమవరంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన పిదప ఏలూరు సిఆర్ రెడ్డి కళాశాలలో న్యాయశాస్త్రం పూర్తి చేసి 1987లో న్యాయవాదిగా ఎన్రోల్ అయ్యారని గుర్తు చేశారు. 2013లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అదనపు న్యాయమూర్తిగా, 2014లో న్యాయమూర్తిగా పదోన్నతి పొంది న్యాయమూర్తిగా విశిష్ట సేవలందించారని తెలిపారు. జస్టిస్ శేషసాయి సహనానికి పెట్టింది పేరుగా న్యాయ వ్యవస్థలో అమూల్యమైన సేవలు అందించారని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు.

జస్టిస్ ఎవి శేషసాయి న్యాయమూర్తిగా తన కేరీర్ లో సుమారు 23 వేల కేసులను పరిష్కరించడం జరిగిందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో ఇంచుమించు అన్నివిభాగాల్లోను జస్టిస్ శేషసాయి పనిచేసి మంచి సేవలందించారని కొనియాడారు. ముఖ్యంగా ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గా జస్టిస్ శేష సాయి సేవలను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఠాకూర్ ప్రత్యేకంగా ప్రసంశించారు. అలాగే వివిధ జాతీయ బ్యాంకుల సిబ్బందికి నైపుణ్య శిక్షణ అందించారని అన్నారు. అంతేగాక విశాఖపట్నం, రాజమహేంద్రవరం కేంద్ర కారాగారాల్లో శిక్షణా కార్యక్రమాలను నిర్వహించారని చెప్పారు. వివిధ న్యాయ కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో విద్యార్థులకు న్యాయ పరమైన అవగాహన కల్పించేందుకు జస్టిస్ శేషసాయి కృషి చేశారని తెలిపారు. జస్టిస్ శేష సాయి వారి శేష జీవితం ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో సాగాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆకాంక్షించారు. పదవీ విరమణ చేయనున్న న్యాయమూర్తి జస్టిస్ ఎవి శేషసాయి మాట్లాడుతూ ముందుగా తన న్యాయమూర్తిగా తన కెరీర్ లో సహాయ సహకారాలు అందించిన ప్రస్తుత ప్రధాన న్యాయ మూర్తి సహా పూర్వపు ప్రధాన న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, న్యాయవాదులు, తన ఫేషీ అధికారులు, సిబ్బంది ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు విభజన జరిగి ఎపికి ప్రత్యేక హైకోర్టు ఏర్పాటు సమయంలో తాత్కాలిక వసతుల ఏర్పాటులో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. ఆ సయమంలో విజయవాడ, గుంటూరు న్యాయవాదులు అందించిన సహాయ సహకారాలను గుర్తు చేసుకుంటూ వారందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బార్ అసోసియేషన్ దేశంలోని అత్యుత్తమ బార్ అసోసియేషన్లలో ఒకటని జస్టిస్ ఎవి శేషసాయి ఈసందర్భంగా పేర్కొన్నారు. న్యాయ మూర్తిగా తాను ఫిజికల్ గా పదవీ విరమణ చేస్తున్నప్పటికీ ఎల్లప్పుడూ తన మనసంతా ఇక్కడే ఉంటుందని జస్టిస్ శేషసాయి అన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ జస్టిస్ ఎవి శేషసాయి పలు సివిల్, క్రిమినల్ చట్టాలకు సంబంధించి అనేక అంశాల్లో చురుకైన పాత్రపోషించి న్యాయ వ్యవస్థకు మంచి సేవలు అందించారని కొనియాడారు. హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె. చిదంబరం మాట్లాడుతూ జస్టిస్ శేషసాయి న్యాయమూర్తిగా అనేక అంశాల్లో కీలకమైన తీర్పులు ఇచ్చారని గుర్తు చేశారు. అంతేగాక లీగల్ అవేర్నెస్ కు సంబంధించి అనేక సెమినార్లు, సింపోజియంలు నిర్వహించి అవగాహన కల్పించారని చెప్పారు.

ఎపి హైకోర్టు బార్ కౌన్సిల్ అధ్యక్షులు ద్వారకానాధ్ రెడ్డి మాట్లాడుతూ 25 ఏళ్ళు న్యాయవాదిగా, 11 సంవత్సరాలు న్యాయమూర్తిగా జస్టిస్ శేషసాయి న్యాయ వ్యవస్థలో విశేషమైన సేవలు అందించారని కొనియాడారు.

అత్యంత నిరాడంబరంగా జరిగిన ఈవీడ్కోలు కార్యక్రమంలో పలువురు హైకోర్టు న్యాయ మూర్తులు, రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి సత్య ప్రభాకర్ రావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ వై. లక్ష్మణరావు, పలువురు ఇతర రిజిస్ట్రార్లు, సీనియనిర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు, ఎపి లీగల్ సర్వీసెస్ అథారిటీ, ఎపి జుడీషియల్ అకాడమీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అన్యాయాన్ని ఎదురిస్తూనే ఉంటా..

(మొదటి పేజీ తరువాయి)

భాకాంక్షలు తెలిపారు. శుక్రవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించగా.. సాయంత్రం పదవీ విరమణ చేశారు. పోలీసుశాఖ పరంగా ప్రస్తుతం డీజీ హెూదాలో ఉన్నారు. ఏబీవీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి తదితరులు ఉన్నారు.

**అన్యాయాన్ని ఎదురిస్తూనే ఉంటా..**

"సర్వీసులో ఉన్నన్ని రోజులు నీతి.. నిజాయతీతో పనిచేశా. పూర్తి సంతృప్తితో పదవీ విరమణ చేస్తున్నా. వృత్తి రీత్యా ఎంతోమందిని చూశాను. నేను చేసిన పోరాటం చూసి.. ఎన్నో లక్షల మంది స్పందించారు. వారందరికీ రుణపడి ఉంటా. నా బాధ, పోరాటం, నిజాయతీ ఎంతో మందికి దగ్గర చేశాయి. ఈరోజు వృత్తిరీత్యా మాత్రమే రిటైరవుతున్నా. చివరి శ్వాస వరకు అన్యాయాన్ని ఎదురిస్తూనే ఉంటా. బాధితుల తరఫున పోరాడుతూనే ఉంటా" అని ఈ సందర్భంగా ఏబీవీ తెలిపారు.

"రెండు సంవత్సరాల తర్వాత ఇదే ఆఫీసులో ఛార్జ్ తీసుకుంటున్నా. నాకు అభినందనలు తెలిపేందుకు వచ్చిన వారికి కృతజ్ఞతలు. ఇవాళ నా పదవీ విరమణ రోజు.. ఈ రోజే పోస్టింగ్ ఆర్డర్ తీసుకున్నా. సాయంత్రం పదవీ విరమణ చేసే అవకాశం నాకు మాత్రమే వచ్చింది. కారణాలు ఏమైనా ఆల్ ఈజ్ వెల్ అని భావిస్తున్నా.

ఇంతకాలం నాకు అండగా ఉండి ధైర్యం చెప్పిన మిత్రులు, శ్రేయోభిలాషులకు రుణపడి ఉంటాను. నా కుటుంబ సభ్యులు, స్నేహితులకు ధన్యావాదలు. యూనిఫాంతో పదవీ విరమణ చేయడం నా కల నెరవేరినట్లుగా భావిస్తున్నా" అని ఏబీవీ తెలిపారు.

# కౌంటింగ్ కు పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి)

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపీలో కౌంటింగ్ కు భారీగా ఏర్పాట్లు చేస్తోంది ఈసీ. రికార్డు స్థాయిలో కేంద్ర బలగాలు మోహరించాయి. కౌంటింగ్ సందర్భంగా అల్లర్లు జరిగే అవకాశం ఉంని భావిస్తున్న పోలీసులు.. కౌంటింగ్ కేంద్రాల దగ్గర 144 సెక్షన్ విధించారు. మరోవైపు ఏపీ వ్యాప్తంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు పోలీసులు.

కౌంటింగ్ సందర్భంగా రాష్ట్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది ఈసీ. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముకేశ్ కుమార్ మీనా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటన చేశారు. ఈవీఎంలు భద్రపరిచిన కేంద్రాలను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. రిటర్నింగ్ అధికారులు, జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ లు నిర్వహిస్తున్నారు. పోలింగ్ సమయంలో, పోలింగ్ తర్వాత రాష్ట్రంలో చోటు చేసుకున్న అవాంఛనీయ సంఘటనల నేపథ్యంలో మరింత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కేంద్రం నుంచి కూడా అదనపు బలగాలు ఏపీకి వచ్చాయి. కౌంటింగ్ కోసం రికార్డు స్థాయిలో కేంద్ర బలగాలను మోహరించారు.

అన్ని కౌంటింగ్ కేంద్రాల దగ్గర 144 సెక్షన్ పెట్టారు. కౌంటింగ్ కేంద్రాల దగ్గర గుమికూడకూడదు. ముఖ్యంగా పల్నాడు, అనంతపురం, కడప.. ఎక్కడెక్కడ అయితే పోలింగ్ రోజున, పోలింగ్ తర్వాత హింసాత్మక ఘటనలు జరిగాయో.. ఆయా ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించారు. కౌంటింగ్ రోజున హింస జరిగే అవకాశం ఉందని అటు టీడీపీ, ఇటు వైసీపీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం మరింత అలర్ట్ అయ్యింది. శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్ట ఏర్పాట్లు చేసింది. పెద్ద సంఖ్యలో కేంద్ర బలగాలను రంగంలోకి దించింది.

# ఈఎస్ఐ హాస్పిటల్ లో ఉద్యోగానికి 10 లక్షల రూపాయలు వసూలు చేశారు

## వంగా గీతపై వర్మ సంచలన ఆరోపణలు



**పిఠాపురం ( జర్నలిస్ట్ ఫైల్ ):** కాకినాడ జిల్లా పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి వంగా గీతపై సంచలన వ్యాఖ్యలు చేశారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వర్మ.. కాకినాడ ఈఎస్ఐ హాస్పిటల్ లో ఉద్యోగానికి 10 లక్షల రూపాయలు చొప్పున వంగా గీత తీసుకొని ఉద్యోగాలు ఇప్పిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఉద్యోగాలు ఏ విధంగా వేస్తారు? అని నిలదీశారు. ఈఎస్ఐ హాస్పిటల్ ఉద్యోగాలలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్నారు. సుమారు 30 మంది దగ్గర పది నుంచి 15 లక్షల రూపాయల వరకు సిట్టింగ్ ఎంపీగా ఉన్న పిఠాపురం వైసీపీ అభ్యర్థి వంగా గీత వసూలు చేశారని పేర్కొన్నారు. అయితే, మా (టీడీపీ–జనసేన–బీజేపీ) ప్రభుత్వం వచ్చిన వెంటనే.. ఈ వ్యవహారంపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి విచారణ చేయిస్తామని ప్రకటించారు తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే వర్మ.. దీంతో.. ఎన్నికల ఫలితాలకు ముందే.. పిఠాపురంలో పొలిటికల్ హీట్ పెరిగినట్టు అయ్యింది.. ఎన్నికల ప్రచార సమయంలో.. విమర్శలు, ఆరోపణల పర్వం జోరుగా సాగగా.. ఫలితాలకు ముందు.. వంగా గీతపై వర్మ చేసిన ఆరోపణలు ఇప్పుడు చర్చగా మారాయి.

# ఓటమిని తట్టుకోలేక సజ్జల రెచ్చగొట్టే వ్యాఖ్యలు



**శ్రీ సత్య సాయి జిల్లా ( జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యలు సభ్య సమాజం, ప్రజాస్వామ్యవాదులు అసహ్యించుకునే రీతిలో ఉన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తున్న వాతావరణం పూర్తిస్థాయిలో నెలకొందని కదిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన కదిరిలో మీడియాతో మాట్లాడుతూ.. ఓటమిని తట్టుకోలేక సజ్జల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని, వైసీపీ నిబంధనలు పాటించని పార్టీ అని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, క్రమశిక్షణకు మారు పేరు అని అన్నారు. చట్టబద్ధంగా వెళ్దామని, చట్టాన్ని గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉందని ఆయన టీడీపీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనలకు ప్రేరేపించినా.. సయంమనం పాటించాలని సూచించారు. ఎన్నికల్లో గెలవబోతున్నామని, ప్రభుత్వంలో భాగస్వాములం కాబోతున్నామని, విజయాన్ని ప్రజల కోసం, ఈ ప్రాంత అభివృద్ధి కోసం, వినియోగించుకునే విధంగా ఆలోచన చేద్దామని కందికుంట వెంకటప్రసాద్ అన్నారు.

# శిశు విక్రయాలు, అక్రమ దత్తత స్వీకరించిన వారిపై కఠిన చర్యలు

## రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పసి పిల్లలును విక్రయించినా, అనధికారికంగా దత్తత స్వీకరించినా అటువంటి వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశాలు జారీ చేశారు.

ఇటీవల రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఒక నెల నుండి ఒక సం .లోపు కొంతమంది శిశువులను వివిధ ప్రాంతాల నుండి అక్రమంగా సేకరించి సంతానం కలగలేని దంపతులను లక్ష్యంగా చేసుకుని దేశంలోని ప్రధాన నగరాల కేంద్రాలుగా పసి పిల్లలును కొన్ని లక్షలకు విక్రయిస్తున్న కొంతమంది అంతరాష్ట్ర మధ్యవర్తుల ముఠాను పోలీసు అధికారులు స్టింగ్ ఆపరేషన్ చేసి పట్టుకోవడం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 16 మంది శిశువులు గుర్తించి హైద్రాబాద్ లో శిశు సంరక్షణ కేంద్రంలో చేర్పించడం జరిగింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ మరియు రాష్ట్ర పోలీస్ అధికార్లు తక్షణమే విచారణ చేపట్టి నివేదికను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ కు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ప్రముఖ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వచ్చిన కథనాల నేపథ్యంలో ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి, ఆ బాలల వివరాలు సేకరించడం తో పాటు ఈ బాలల అక్రమ రవాణా రాకెట్ వెనుక ఉన్నవారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ మరియు, రాష్ట్ర పోలీస్ ఉన్నత అధికారులకు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు జారీచేసారు.

ఇటీవల ప్రముఖ స్వచ్ఛంద సంస్థలు దేశంలో నిర్వహించిన ఒక సర్వేలో బాలల అక్రమ రవాణాను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అనగా ప్రత్యేక నెట్వర్క్ , లింక్లు, ఎప్స్, సోషల్ మీడియా లో పసిపిల్లలు ఫొటోస్ పంపించి అడ, మగ పిల్లలకు ప్రత్యేక కోడ్ లను ఉపయోగించి విక్రయాలు సాగిస్తున్నట్టు తెలిపారు.

రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటే ఆసుపత్రిల్లో , ఫెర్టిలిటీ కేంద్రాలు, క్లినిక్ లలో నిరంతరం నిఘా, పర్యవేక్షణ ఉంచాలని, గ్రామ స్థాయిలో అంగన్వాడి , సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ ఉండేలా చూడాలని రాష్ట్ర అధికారులను బాలల హక్కుల కమిషన్ ఆదేశాలు జారీ చేశారు. అలాగే శిశువుల విక్రయాల అంశం పై ఎటువంటి సమాచారం అందినా వెంటనే బాలల హక్కుల కమిషన్ దృష్టికి తీసుకొని వస్తే వెంటనే సుమోటోగా తీసుకొని వారిపై తగిన శాఖాపరమైన చర్యలు చేపడుతుందన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర స్థాయిలో బాలలు తో పనిచేసే సంబంధిత అధికారులకు, సిబ్బందికి గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు.

# ఈ చావులకు బాధ్యులెవరు ?

(మొదటి పేజీ తరువాయి)

విమర్శిస్తున్నారు. కుళాయి నీరు తాగేందుకు అవకాశం లేకపోవడంతో అనేక మంది డబ్బులు ఖర్చు పెట్టి వాటర్ క్యాన్లను కొంటున్నారు. ఇక, ఇతర అవసరాలకు కలుషిత నీటినే వినియోగించడంతో చర్మ సంబంధ వ్యాధులు వస్తున్నాయని విజయవాడ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

ఆలస్యంగా మేల్కొన్న అధికారులు డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటి సర్వే పేరుతో రక్తనమూనాలను సేకరిస్తున్నారు. వాటి ఫలితాలను ఇప్పటి వరకు వైద్యారోగ్య శాఖ వెల్లడించలేదు. ఇక, నీటి నమూనాల పరీక్షలు ఫలితాల కోసం వేచి చూస్తున్నారు. ఇందులో నైట్రేట్ లు అధికంగా ఉండటమే కారణం కావచ్చని ప్రాథమిక అంచనా వేస్తున్నారు. రేపు ఉదయానికి నీటి టెస్టుల రిపోర్టులు వస్తాయని అధికారులు తెలియజేస్తున్నారు.

# ఉపాధి హామీ పనుల్లో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**క్రోసూరు (జర్నలిస్ట్ ఫైల్) :** వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో క్రోసూరులోని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కార్యాలయం వద్ద పెరికపాడు గ్రామంలోని వ్యవసాయ కూలీలు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు చూపించాలని స్థానిక ఏపీఓ కలిసి అర్జీ ఇవ్వడమైనది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల గౌరవాధ్యక్షులు తిమ్మిశెట్టి హనుమంతరావు మాట్లాడుతూ పెరికపాడు గ్రామంలో ఉపాధి హామీ పనులు చేయడానికి చాలామంది కూలీలు సిద్ధంగా ఉన్నారని, 20 రోజులు క్రితం జరిగిన గ్రామ సభలో పనులు చేయించాలని , అర్జీ పెట్టినప్పటికీ సమస్య పూర్తిగా పరిష్కారం కాలేదని. పేర్లు ఆన్లైన్లో కనపడకపోవడం వలన పనులు చేయడానికి వీలు కాకుండా ఇప్పటికీ సుమారు 80 మంది వ్యవసాయ కార్మికులు ఖాళీగా ఉండాల్సి వస్తుందని అన్నారు . గత సంవత్సరం పనిచేసిన వారి పేర్లు కూడా కనబడటం లేదని అన్నారు. గత సంవత్సరం పనిచేసిన కొంతమంది వ్యవసాయ కూలీలకు బిల్లులు రాకపోవడం వలన ఈ సంవత్సరం కూడా బిల్లులు ఆగిపోతాయేమోనని ఆందోళనలో ఉన్నారని , సమస్యను పరిశీలించి వెంటనే పరిష్కారించాలని అన్నారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ , గ్రామంలోని ఫీల్డ్ అసిస్టెంట్ ను కొత్త వ్యక్తిని నియమించడం వలన కొంత ఇబ్బంది ఉందని , కొంతమంది బ్యాంకు ఎకౌంట్లు , ఆధార్ కార్డులో టెక్నికల్గా సమస్యలు ఉన్నాయని , వారి వివరాలు ఫీల్డ్ అసిస్టెంట్ కు తెలియజేశామని అన్నారు. ఈనెల 3 వ తేదీన సోమవారం మరొకసారి గ్రామ సభ జరిపి వ్యవసాయ కూలీలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కుంభ లక్ష్మి , బి. అరుణ , ఏపూరి శేషమ్మ, బయ్యవరపు అలివేలు, బి రేణుక, జోజమ్మ, ఏపూరి ఏడుకొండలు పాల్గొన్నారు.

# మా భూములు లాక్కోవడంలో సీఎస్ జవహర్ రెడ్డి హస్తం

(మొదటి పేజీ తరువాయి)



తేల్చిచెప్పామని తెలిపారు. విశాఖకు చెందిన పలువురు భూకబ్జా బాధితులతో తెదేపా, జనసేన నేతలు శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. అల్లరి మూకలను ఉసిగొల్పి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని.. తమకు తాతల కాలం నుంచి వారసత్వంగా వచ్చిన భూముల్లో రాళ్లు పాతుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భూములు లాక్కోవడంలో సీఎస్ జవహర్ రెడ్డి హస్తం ఉందని భావిస్తున్నామన్నారు.

**సీఎస్ ఆదేశాల మేరకే రైతుల పొలాల్లో రాళ్లు పాతారు: పీతల మూర్తి యాదవ్**

భూములు ఇవ్వబోమని స్థానికులు పోరాడారని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ తెలిపారు. సీఎస్ ఆదేశాల మేరకే రైతుల పొలాల్లో అధికారులు రాళ్లు పాతారని ఆరోపించారు. "సీఎస్ జవహర్రెడ్డే స్వయంగా వచ్చారని రైతులు చెబుతున్నారు. పేదల భూములు కొట్టేసేందుకు వైకాపా రాబందులు వస్తున్నాయి. జీవో నంబర్ 596ను అడ్డుపెట్టుకుని భూములను లాక్కునే ప్రయత్నం చేస్తున్నారు. రైతులను భయపెట్టి భూములను కాజేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇతరులు రాయించుకున్న విషయం రైతులకూ తెలియదు. రికార్డుల పరిశీలనకు అవ కాశం లేకుండా వెబ్సైట్ను ఆపేశారు. అది ఓపెన్ చేస్తే భూములు ఎవరి పేరుతో ఉన్నాయో పరిశీలించవచ్చు. పోరాటానికి రైతులు ముందు కు రావడం అభినందనీయం. రైతుల గోడును కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. అవసరమైతే ఈసీ, కోర్టుకూ వెళ్తాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతులకు న్యాయం చేస్తుంది" అని మూర్తి తెలిపారు.


# ఇదేం పోలీసింగ్ ? రక్షించమంటే... లంచం అడిగారు !

- **కాపాడమంటే.. రూ. 15 వేలు లంచం అడిగారు..అసభ్యంగా దూషించారు**
- **ప్రత్తిపాడు స్టేషన్ ఎస్ ఐపై ఆరోపణలు**
- **ఆరోపణలపై వివరణ కోరేందుకు ప్రయత్నించగా స్పందించని సౌత్ డీఎస్పీ**

**( కూరపాటి విజయబాబు, రీజనల్ క్రైం బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్ )**

**గుంటూరు :** ఆంధ్ర ప్రదేశ్ లోని గుంటూరు జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది సభ్య సమాజం తలదించుకునేలా మహిళా లోకం తలదించుకునేలా వ్యవహరించిన పోలీసులు తీరు విస్మయానికి గురిచేస్తుంది . ప్రాణాపాయ స్థితిలో ఉన్నాను రక్షించండి అంటూ వేడుకుంటే... రూ. 15వేలు లంచం అడిగారంటూ పోలీసులపై బాధిత యువతి తరుపు వ్యక్తి ఆరోపణలు చేస్తున్నారు . బాధితురాలు తరుపున ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ కు వెళ్లిన వ్యక్తి తెలిపిన వివరాలు ప్రకారం...

గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు మండలంలో తుమ్మలపాలెం గ్రామానికి చెందిన అవివాహిత యువతి అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై మనసు పారేసుకుంది. ఈ వ్యవహారం రుచించని యువతీ కుటుంబ సభ్యులు అనేకమార్లు యువతిని పలు రకాలుగా ఇబ్బంది పెట్టినట్లు తెలుస్తోంది. వాళ్ళ వేధింపులు భరించలేని సదరు యువతీ ఈనెల ఐదున ఎవరికి చెప్పాపెట్టకుండా ఇంటి నుండి వెళ్లిపోయింది. అయితే ఓ చర్చిలో తల దాచుకున్న ఆమె.. మరుసటి రోజు ఆరవ తారీఖున తల్లిదండ్రులు చేస్తున్న ఆకృత్యాలపై ప్రత్తిపాడు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసేందుకు యువతి వెళ్లి ఫిర్యాదు చేసిననట్లు సమాచారం అయితే ఈనెల 26 ఆదివారం అర్ధరాత్రి యువతి తలదాచుకున్న రహస్య ప్రదేశం తెలుసుకున్న తల్లిదండ్రులు బంధువులు.. ఆ ప్రదేశము నుండి బలవంతంగా కొట్టుకుంటూ ఈడ్చుకుంటూ లాక్కెళ్ళినట్లు చెబుతున్నారు. కుటుంబీకులు చేస్తున్న భౌతిక దాడుల నుండి తాళలేక ఈనెల 27న ప్రత్తిపాడు సిఐ కి, తోటి సన్నిహితులకు సేవ్ మీ ప్లీజ్ సార్ అని మెసేజ్ ఆ యువతి మెసేజ్ చేశారట. ఈ సందేశాన్ని చూసిన యువతి సన్నిహితుడు పోలీస్ స్టేషన్ కు వెళ్లగా అతనికి చేదు అనుభవం ఎదురైనట్లు ఆ సన్నిహితుడు పేర్కొన్నాడు. ఆ పోలీస్ స్టేషన్ లో ఓ ఎస్ ఐ తనను అసభ్యకర పదజాలంతో దూషించడమే కాకుండా 15 వేల రూపాయలు లంచం డిమాండ్ చేశారని... అంతటితో ఆగకుండా ఆ యువతితో చేసిన సాన్నిహిత్యం పై విడమర్చి చెప్పాలంటూ అసభ్యంగా మాట్లాడారాని ఎస్సై పై పలు ఆరోపణలు ఆ సన్నిహితులు చేశారు. ఆ యువతి పంపిన మెసేజ్ కు సిఐ తో పాటు ఎస్ఐ పలువురు స్టేషన్ సిబ్బంది సరిగ్గా స్పందించకపోవడంతో యువతి నిస్సహాయ స్థితిలో ఉన్నట్లు సమాచారం . ఆ యువతి తగుంటూరు నగరంలోని మహిళా ప్రాంగణంలో గల హెూం నందు ఆశ్రయం పొందారట. తాను మేజర్ అని చెప్పినప్పటికీ పోలీసులు వ్యవహరించిన తీరు మహిళా లోకం తలదించుకునేలా ఉందని ,



అంతేకాకుండా యువతి సన్నిహితుడు పట్ల వ్యవహరించిన తీరు పోలీస్ శాఖ ప్రతిష్టను దిగజార్చిందని ఆ యువతి ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణల్లో వాస్తవం ఏ మేర ఉందో కనుక్కునేందుకు...దీనిపై వివరణ కోరేందుకు గుంటూరు సౌత్ డీఎస్పీ మహబూబ్ బాషాను సంప్రదించగా ఆయన స్పందించలేదు.

## దివ్యాంగులకు ఉచితంగా శ్రీవారి దర్శనం



**తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ) :** శ్రీవారిని దర్శనానికి వచ్చే దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్‌కు టీటీడీ శుభవార్త చెప్పింది. వీళ్లకు స్వామి వారి ఉచిత దర్శనం కల్పించేందుకు చర్యలు చేపట్టింది. కేవలం వారి కోసమే రోజులో ఒకసారి ప్రత్యేక స్లాట్ ఏర్పాటు చేస్తూ టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది. సోమవారం నుంచి శనివారం వం-కు ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి స్వామి వారిని దర్శించుకునేందుకు అనుమతించనుంది.

**ప్రత్యేక ఎలక్ట్రికల్ కారు**

ఆలయం బయట గేట్ వద్ద పార్కింగ్ ప్రాంతం నుంచి కౌంటర్ వరకు ప్రత్యేక ఎలక్ట్రిక్ కారు అందుబాటులో ఉంటుందని టీటీడీ వివరించింది. వృద్ధులు, దివ్యాంగుల స్లాట్ సమయంలో మిగతా ఇతర క్యూలు నిలిపివేస్తారని.. ఎలాంటి ఇబ్బంది లేకుండా కేవలం 30 నిమిషాల్లోనే స్వామి వారిని దర్శించుకుని బయటకు రావొచ్చని తెలిపారు. అలాగే దర్శనం చేసుకునే వృద్ధులు, దివ్యాంగులు రూ. 20 చెల్లించి రెండు లడ్డూలను తీసుకోవచ్చని టీటీడీ పేర్కొంది.

**అర్హులు వీరు..**

వృద్ధులకు వయసు 65 సంవత్సరాలు పూర్తై ఉండాలి. దివ్యాంగులు, ఓపెన్ హార్ట్ సర్జరీ, కిడ్నీ ఫెయిల్యూర్, క్యాన్సర్, పక్షవాతం, ఆస్తమా లక్షణాలున్న ఉన్న వ్యక్తులు కూడా తిరుమల ఉచిత దర్శనం చేసుకోవచ్చని అధికారులు వివరించారు. ఒకవేళ వృద్ధులు నడవలేని స్థితిలో ఉంటే వారి వెంట ఓ వ్యక్తికి అనుమతి ఉంటుందని.. అటెండర్‌గా జీవిత భాగస్వామికి మాత్రమే అనుమతి ఉంటుందన్నారు.

## ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లపై బదిలీ



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ముగ్గురు డిప్యూటీ కలెక్టర్ల పై బదిలీ వేటు పడింది. ఈ మేరకు ఏపీ సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఒంగోలు పార్లమెంటు పరిధిలోని ఎర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు పి. శ్రీలేఖ పై బదిలీ వేటు పడింది. కర్నూ డిప్యూటీ కలెక్టర్ ఏ. మురళి, అనంతపురం డిప్యూటీ కలెక్టర్ రాంభూపాల్ రెడ్డిలు కూడా ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే కారణంతో బదిలీ వేటు పడింది. వీరిని బదిలీ చేస్తూ సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ముగ్గురు అధికారులు సాధారణ పరిపాలన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వద్దకు తదుపరి ఉత్తర్వులకోసం రిపోర్ట్ చేయాలని సీఎస్ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బదిలీ వేటుకు గురైన డిప్యూటీ కలెక్టర్ల స్థానంలో వేరే వారిని నియమిస్తూ సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. వీరు ఆయా స్థానాల్లో ఆర్వోలుగా ఎంసీసీ పూర్తయ్యే వరకూ వ్యవహరించనున్నట్టు సమాచారం. డిప్యూటీ కలెక్టర్లుగా నియామకమైన వారిలో ఎం. వెంకట సత్యనారాయణ, సి. విశ్వనాథ్, జె. శిరీషలు ఉన్నారు.

ఎం వెంకట సత్యనారాయణను మార్కాపూర్ ఆర్ అండ్ ఆర్ యూనిట్ కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా బదిలీ చేయగా.. సి విశ్వనాథ్ ను కర్నూల్ హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్ త్రీకి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా బదిలీ చేశారు. జే . శిరీషను అనంతపురం పిఏబిఆర్ 2కు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గా బదిలీ చేశారు. ఈ మేరకు సీఎస్ జవహర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

## పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి కోసం కొనసాగుతున్న పోలీసుల వేట..!



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి కోసం పోలీసుల సెర్చింగ్ చేస్తున్నారు. ఆయన తమిళనాడు లో ఉన్నట్టు ప్రచారం జరుగుతుంది. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడు తురకా కిశోర్ తో పాటు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి తమిళనాడులో తల దాచుకున్నట్లు తెలుస్తుంది.

పోలింగ్ నాడు ఈవీఎం ధ్వంసం, సీఐపై హత్యాయత్నం కేసులో పిన్నెల్లి సోదరులపై పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అయితే, అన్న రామకృష్ణారెడ్డి ముందస్తు బెయిల్‌తో అజ్ఞాతం వీడారు. తమ్ముడు వెంకట్రామిరెడ్డి మాత్రం బెయిల్ కోసం కూడా దరఖాస్తు చేసుకోని పరిస్థితి కనిపిస్తుంది.

## రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వివరాలు వెల్లడించాలి



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆధ్వర్యంలో 11 మంది నేతల బృందం శుక్రవారం రాజభవన్ లో గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ ను కలిసింది. 13 అంశాలపై గవర్నర్ కి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ఆర్బీఐ జాబితా ప్రకారం తెచ్చిన మొత్తం అప్పులు, కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలు, రాష్ట్ర ప్రభుత్వం తాకట్టు పెట్టిన ఆస్తుల వివరాలు ప్రకటించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

గవర్నర్ తో భేటీ అనంతరం పురందేశ్వరి మీడియాతో మాట్లాడారు. "వైసీపీ ప్రభుత్వం కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అడ్డగోలుగా అప్పులు తెచ్చింది. గ్రామాల్లో పనులు చేసిన సర్పంచ్లు, కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా ఇవ్వలేదు. కేంద్రం గ్రామీణాభివృద్ధి కోసం మంజూరు చేసిన నిధులను దారి మళ్లించారు. మద్యంపై భవిష్యత్లో వచ్చే ఆదాయాన్ని కూడా చూపి అప్పులు చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పై రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ అడిగే హక్కు గవర్నర్కు ఉంది. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెట్టి తెచ్చిన అప్పుల వివరాలు కావాలని కోరాం. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత కూడా నచ్చిన వచ్చిన వారికి ఇష్టారాజ్యంగా బిల్లులు చెల్లించారు" అని పురందేశ్వరి ఆరోపించారు.

## కడప జిల్లా నుంచి 21 మంది రౌడీషీటర్ల బహిష్కరణ



**కడప ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఓట్ల లెక్కింపునకు ఆంధ్రప్రదేశ్‌లో అధికార యంత్రాంగం పక్కాగా సిద్ధమైంది. జూన్ 4న జరగనున్న ఎన్నికల కౌంటింగ్?కు భారీగా పటిష్ట ఏర్పాట్లు చేస్తోంది. రికార్డుస్థాయిలో రాష్ట్రంలో కేంద్ర బలగాలను మోహరించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. ఏపీ వ్యాప్తంగా పోలీసులు కార్డన్ సెర్చ్ కొనసాగిస్తున్నారు. మరోవైపు అన్ని జిల్లాల్లోనూ కౌంటింగ్? ఏర్పాట్లు పూర్తయ్యాయి.

**21 మంది రౌడీషీటర్ల జిల్లా బహిష్కరణ**

కడప జిల్లా వ్యాప్తంగా 1038 మంది రౌడీలకు పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. నేటి నుంచి 21 మంది రౌడీ షీటర్లపై జిల్లా బహిష్కరణ విధించారు. ఈ సాయంత్రం నుంచి జూన్ 7వ తేదీ వరకు జిల్లాలోకి వీరికి అనుమతి నిరాకరించారు. కౌంటింగ్ రోజు ఘర్షణ జరగకుండా ఉండేందుకు 652 మందిని ముందస్తుగా పోలీసులు అదుపులోకి తీసుకోనున్నారు. 131 మంది రౌడీషీటర్లు బయటకు రాకుండా గృహనిర్బంధం విధించారు.

**లాడ్జీలు, హోటళ్లు బందీ :** ఎన్నికల కౌంటింగ్? నేపథ్యంలో అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా కడప జిల్లా పోలీసులు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బయట వ్యక్తులు జిల్లాలోకి అక్రమంగా ప్రవేశించకుండా ఆంక్షలు విధించారు. కడప నగరంలో జూన్ 3 నుంచి లాడ్జిలు, ఫంక్షన్ హాళ్లు, హోటల్స్‌లో ఎవరూ బసచేయకూ డదని, ఓట్ల లెక్కింపు సమయంలో పూర్తిగా మూసేయాలని ఆదేశాలిచ్చారు. 144 సెక్షన్ జూన్ 6 వరకు కొనసాగుతోందని, సహకరించాలని కోరారు.

## వడగాల్పులతో అల్లాడుతున్న ప్రజలు.. ఆరెంజ్ అలెర్ట్



దేశంలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించినా ఎండల తీవ్రత మాత్రం తగ్గడం లేదు. ఉత్తర భారత దేశం వేడిగాలులతో అల్లాడుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోనూ రెండు రోజులుగా అత్యధిక ఉష్ణోగ్రత నమోదవుతుండడంతో ప్రజలు ఉక్క పోతలకు గురవుతున్నారు. ఉదయం నుంచే వడగాల్పులు వీస్తుండటంతో ఇంటి నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు ఫ్యాన్లు, ఏసీలు ఎక్కువగా వాడుతుండటంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఎండ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు

**విజయవాడ అర్బన్ ప్రజలకు హెచ్చరిక**

ఎన్టీఆర్ జిల్లా విజయవాడ అర్బన్ మండల ప్రజలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ శుక్రవారం ఆరెంజ్ అలెర్ట్ జారీచేసింది. మండలంలో నేడు వడగాలులతో పాటు 45.1 ఉష్ణోగ్రత వరకు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వెల్లడించింది. మండల వాసులంతా అప్రమత్తంగా ఉంటూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. నిన్న విజయవాడ అర్బన్‌లో 43.5 డిగ్రీల నమోదయింది.

## ఘోర రోడ్డు ప్రమాదం- ఇద్దరు మృతి



**మండపేట ( జర్నలిస్ట్ ఫైల్ ) :** బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జొన్నాడ, మండపేట ఆర్అండ్‌బి రోడ్డుపై మండలంలోని గుమ్మిలేరు సమీపంలో శుక్రవారం ఉదయం బొలెరో వ్యాన్ ను ట్రాక్టర్ ఢీకొన్న సంఘటనలో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాద ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో ఎస్సై ఎల్.శ్రీను నాయక్ తన సిబ్బందితో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మండల కేంద్రానికి చెందిన ఐదుగురు మత్స్యకారులు ఏపీ 39 వీడి 0089 నెంబరు బొలెరో వాహనంలో తుంగపాడు చెరువుల వద్దకు చేపల వేటకు బయలుదేరారు. ఈ క్రమంలో గుమ్మిలేరు జయలక్ష్మి రైస్ మిల్ సమీపానికి వచ్చేసరికి మండపేట పౌర సరఫరాల గోదాముల నుండి బియ్యం తరలిస్తున్న ఏపీ 05 టి 1890 నెంబర్ గల ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యంగా ఎదురుగా వస్తున్న మత్స్యకారుల వాహనాన్ని బలంగా ఢీకొట్టింది. దీంతో బొలెరో వాహనం వెనుక బాగాన ఉన్న లంకే సూరిబాబు(49), వనమూడి సాయిబాబు(62)లకు బలమైన రక్తపు గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారన్నారు. అయితే అదే వాహనంలో ప్రయాణిస్తున్న మిగిలిన ముగ్గురు మత్స్యకారులు తీవ్రంగా గాయపడ్డారన్నారు. వారిని వైద్య సేవల నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన తరలించామన్నారు. అలాగే ఇరువురి మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం స్థానికుల సహకారంతో మండపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించమన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీను నాయక్ తెలిపారు.

## కుప్పంలో ఏనుగుల బీభత్సం..

**కుప్పం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** చిత్తూరు జిల్లా కుప్పం మండలంలో గజరాజులు హల్ చల్ చేశాయి. అటవీ ప్రాంతంలో నుంచి ఏనుగుల గుంపు పంటపొలాల్లో వెళ్లాయి. వరి, టమోటా, మామిడి పంటలను ధ్వంసం చేశాయి. దీంతో అటవీ శాఖ అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అటవీ శాఖ సిబ్బంది ఏనుగులను తరిమికొట్టేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అయితే స్థానిక అటవీ ప్రాంతం నుంచి వచ్చి తరచూ తమ పంట పొలాలను నాశనం చేస్తున్నాయని స్థానిక రైతులు వాపోతున్నారు. ఏనుగుల దాడితో చేతికొచ్చిన పంట చేజారిపోయిందని రైతులు వాపోయారు. ఏనుగుల నుంచి పంట పొలాలను కాపాడుకునేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు. మరోవైపు భయాందోళనను వ్యక్తం చేశారు. ఎప్పుడు ఏ వైపు నుంచి ఏనుగులు వచ్చి దాడి చేస్తాయోనని ఆవేదన వ్యక్తం చేశారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా



**తిరుమల ( జర్నలిస్ట్ ఫైల్ ) :** కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో స్వామివారి దర్శనం చేసుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద అమిత్ షాకు టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వాగతం పలికారు. అనంతరం దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం శ్రీవారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు. అ-ర్చకులు అమిత్ షాకు వేదాశీర్వచనం పలికారు.

గురువారం సాయంత్రమే అమిత్ షా రేణిగుంటకు చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గం ద్వారా రాత్రి సమయంలో తిరుమలలోని వకుళామాత అతిథిగృహంలో బస చేశారు. శ్రీవారి ఆలయం దగ్గర కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తిరుమలలో అమిత్ షా పర్యటన నేపథ్యంలో మీడియాపై ఆంక్షలు విధించారు. ఆలయం పరిసర ప్రాంతాల్లో ఎవరిని అనుమతించకుండా భద్రత కట్టుదిట్టం చేశారు.

## గుంటూరు జీజీహెచ్ లో ఇద్దరు ప్రొఫెసర్ల పదవీ విరమణ



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి లో ఒకే రోజు వివిధ హోదాల్లో పని చేసిన నలుగురు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. పిడియాట్రిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ పి పద్మలత, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్ పి సత్య శ్రీనివాస్, మినిస్టీరియల్ స్టాఫ్ లో అకౌంటెంట్ పి సత్యనారాయణ, డ్రైవర్ బత్తుల వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ చేశారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ పద్మాలత, సత్య శ్రీనివాస్ లను ఘనంగా శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన ఉద్యోగ విరమణ సభల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టీటీకే రెడ్డి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ డాక్టర్ పద్మావతి, డాక్టర్ సత్య శ్రీనివాస్ రోగులకు చేసిన సేవలను కొనియాడారు. అదేవిధంగా సత్యనారాయణ, వెంకటేశ్వర్లు కూడా ప్రజలకు సేవలు అందించారని వారు కొనియాడారు.

## పోస్టల్ బ్యాలెట్ లో దొంగ ఓట్లు ఎలా వస్తాయి ?

- **కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన సూచనలు అభినందనీయం.**
- **పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్న ప్రతి ఉద్యోగి తన స్వీయ తప్పిదం ఉంటే తప్ప మిగిలిన అన్ని ఓట్లు చెల్లుబాటు అయ్యేలా చూడాలి.**
- **నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఎలక్షన్ డ్యూటీ లో పాల్గొనే ఉద్యోగులు వారి డ్యూటీ సర్టిఫికెట్ మరియు ఇతరత్రా సర్టిఫికెట్లు అందించిన తర్వాతే ఓటు వినియోగించు ఉంటారు అనే చిన్న విషయాన్ని మరచి

కొంతమంది కావాలని పోస్టల్ బ్యాలెట్ లపై గందరగోళం సృష్టిస్తున్నారని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ మరియు మాగంటి శ్రీనివాస రావు లు ఒక ప్రకటనలో తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్ల పై విమర్శించేవారు మొదటి నుంచి ఉద్యోగుల ఓటు హక్కును వినియోగించుకోవడానికి అనేక ఆటంకాలు సృష్టించారని ఈ ఆటంకాలు అన్నిటిని అధిగమించి ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతీ ఉద్యోగి పోస్టల్ బ్యాలెట్ ను ఉపయోగించుకున్నందుకు దేశం మొత్తం ప్రశంసలు అందుకున్న దరిమిలా ఉద్యోగుల ఓటు చెల్లుబాటుపై నిరంతరం విషం కక్కేలా సోషల్ మీడియాలోనూ మరియు ఇతర ప్రసారమాధ్యమాలలో రావటం విచారకరమని పేర్కొన్నారు.

నూరు శాతం ఓట్లు పోలయ్యేలా తీసుకునే చర్యల్లో భాగంగా ఇలాంటి సంక్లిష్టంగా ఉన్న పోస్టల్ బ్యాలెట్ విధానంను సరళీకృతం చేసే క్రమంలో నిరంతరం ఎన్నికల సంఘం తగు సూచనలు ఇస్తుందన్నారు. రాజ్యాంగాన్ని అనుసరించి ఓటు హక్కు ప్రాథమిక హక్కుగా భావించాలని ఓటరు స్వీయ తప్పిదం తప్ప మిగిలిన తప్పిదాలకు ఓటరు బాధ్యత కాదు అన్నారు.

దేశంలో ఉన్న ప్రతి పౌరుడు తనకు హక్కుగా వచ్చిన ఓటును వినియోగించుకోవడం చెల్లుబాటు అయ్యేలా చూసుకోవటం తన బాధ్యతగా తీసుకుంటారని తన స్వీయ తప్పిదాలు కాకుండా ఇతర తప్పిదాలకు తన ఓటు చెల్లుబాటు కాదు అంటే అది తన ప్రాథమిక హక్కు ఉల్లంఘన క్రిందకు వస్తుందని ఆదిశ గానే కేంద్ర ఎన్నికల సంఘం నిర్దిష్టమైన సూచనలను ఇచ్చినందున ఈ విషయంపై అందరూ హుందాగా వ్యవహరించడం మంచిదని విజ్ఞప్తి చేశారు.

## నెల్లూరు జిల్లాలో భారీగా బంగారం పట్టివేత

**నెల్లూరు (జర్నలిస్ట్ ఫైల్):** నగరంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భారీగా బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఓ కారులో బంగారాన్ని తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందడంతో చాకచక్యంగా నిందితులను పట్టుకుని అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... నెల్లూరి జిల్లాలోని కావలిలో భారీగా బంగారాన్ని పోలీసులు పట్టుకున్నారు. కలకత్తా - చెన్నై రహదారిపై వాహనాల తనిఖీలో ఎలాంటి బిల్లులు లేకుండా కారులో తరలిస్తున్న సుమారు రెండున్నర కోట్ల విలువైన మూడు కిలోల బంగారు బిస్కెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ బంగారాన్ని చెన్నై నుంచి విజయవాడకు నిందితులు తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. కారు వెనుక సీట్లో ప్రత్యేకంగా అమర్చిన అరలో బంగారం రవాణా చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులు ఆశిష్, గిరీష్ కుమార్, కమలేష్‌లు చెన్నై టీ నగర్‌లోని లక్ష్మీ జ్యూవెల్లర్స్‌లో పనిచేస్తున్నారని చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసి పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

## తెలంగాణ వార్తలు

# రైతు భరోసా సీలింగ్‌పై టీ.సర్కార్ కసరత్తు




### కౌలు రైతుకూ భరోసాపై స్పష్టత

### జూలై నుంచి అమలు దిశగా అడుగులు

హైదరాబాద్ బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. ఎన్నికల ఫలితాల తరువాత రైతు భరోసా తో పాటుగా రైతు రుణ మాఫీ పైన ప్రభుత్వం కీలక ప్రకటనకు సిద్ధం అవుతోంది. రైతు భరోసా అమలు..సీలింగ్ పైన ప్రభుత్వం ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కొత్త నిర్ణయం మేరకు జూలై నుంచి అమలు దిశగా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. సీలింగ్ పై తీసుకొనే నిర్ణయం పైన ఉత్కంఠ కొనసాగుతోంది. రైతు భరోసా అమలు పరిమితి ఎన్ని ఎకరాలకు ఖరారు చేస్తారనేది ఇప్పుడు కీలకంగా మారుతోంది. మరో రెండు, మూడు రోజుల్లో ప్రారంభం కానున్న వానాకాలం సీజన్‌కు రైతు భరోసాపథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. రైతు భరోసాను ఐదెకరాలకే పరిమితం చేస్తారా.. లేదంటే పది ఎకరాల వరకు కటాఫ్ పెడతారా.. అనే చర్చ సాగుతోంది. గత డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరినప్పటికీ.. యాసంగి సీజన్‌లో పాత పద్ధతి ప్రకారమే(ఎకరాకు రూ. 5వేల చొప్పున) రైతు బంధు అమలు చేసింది. బీఆర్ఎస్ హయాంలో రైతుకు ఎంత భూమి ఉంటే అంత భూమికి రైతుబంధు ఇస్తూ వచ్చారు. అయితే, ఈ పథకానికి పరిమితులు విధించి, ఎకరాకు రూ. 7,500 చొప్పున అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం కసరత్తు ఈ పరిమితి ఎంత వరకు విధిస్తారనే అంశంపై ఇంకా ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. ఎన్నికల ఫలితాల తరువాత ముందుగా క్యాబినెట్ సమావేశంలో, ఆ తర్వాత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనూ చర్చించా లనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నట్లు సమాచారం. అయితే, కేంద్ర బడ్జెట్ సమావేశాలు నిర్వహించిన తర్వాతే... రాష్ట్రంలోనూ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. ఒకవేళ కేంద్ర బడ్జెట్ ఆలస్యమైతే... రాష్ట్రమంత్రి వర్గంలోనే రైతు భరోసాపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఇచ్చిన హామీ ప్రకారం ఎకరాకు రూ. 7500 చొప్పున చెల్లించనుంది. కాగా, కౌలు రైతులకూ రైతు భరోసా పథకం అమలు చేస్తామని మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రకటించింది. అమలు దిశగా భూ యజమానుల నుంచి అఫిడవిట్ తీసుకొని వ్యవసాయ శాఖకు సమర్పిస్తేనే కౌలు రైతులకు రైతు భరోసా అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అయితే, ఈ అంశంపై కూడా క్యాబినెట్ భేటీలో, వీలైతే అసెంబ్లీలోనూ చర్చించి నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి.

ప్రతి సీజన్‌లో కోటిన్నర ఎకరాలకు పెట్టుబడి సాయం పంపిణీ చేస్తున్నప్పటికీ... సాగు విస్తీర్ణం అంత ఉండడం లేదు. కాగా, రెవెన్యూ-వ్యవసాయశాఖ అధికారులతో బృందాలు ఏర్పాటు చేసి, ఈ భూములపై క్షేత్రస్థాయిలో సర్వే చేయించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. జూన్‌లోనే సర్వే ప్రారంభించి, వ్యవసాయ భూముల లెక్కలు తేల్చాలని భావిస్తోంది. దీంతో..రైతు భరోసా పరిమితి పై ప్రభుత్వం తీసుకొనే నిర్ణయం ఏంటనేది ఆసక్తి కరంగా మారుతోంది.



## సమాజ నిర్మాణంలో తుమ్మబాల సేవలు ఎనలేనివి

- అనారోగ్యంతో మాజీ ఆర్చ్ బిషప్ తుమ్మబాల కన్నుమూత
- తుమ్మబాల పార్థివ దేహానికి రేవంత్ నివాళులు
- ప్రజలకు శాంతి, మతసామరస్యం, విద్యను అందించారని వ్యాఖ్య
- వ్యక్తిగతంగా ఆయనతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్న సీఎం

హైదరాబాద్ : మాజీ ఆర్చ్ బిషప్ తుమ్మబాల(80) అనారోగ్యంతో గురువారం కన్నుమూశారు. వరంగల్ బిషప్‌గా పాతికేళ్ల పాటు పని చేసిన తుమ్మ బాల అంత్యక్రియలు ఇవాళ జరగనున్నాయి. సికింద్రాబాద్ సెయింట్ మేరీ బసిలికీలో తుమ్మబాల పార్థివ దేహాన్ని ఖననం చేయనున్నారు. కాగా, సికింద్రాబాద్ సెయింట్ మేరీ స్కూల్‌లో విశ్రాంత ఆర్చ్ బిషప్ తుమ్మబాల పార్థివ దేహానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం నివాళులర్పించారు. ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. సమాజ నిర్మాణంలో తుమ్మబాల ఎనలేని సేవలు అందించారని చెప్పారు. ప్రజలకు శాంతి, మతసామరస్యం, విద్యను అందించారని తెలిపారు. వ్యక్తిగతంగా ఆయనతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. 2019 ఎంపీ ఎన్నికల్లో, 2023 శాసనసభ ఎన్నికల్లో తమను మంచి మనసుతో ఆశీర్వదించారని చెప్పారు. వారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఆయన మరణం వారి అభిమానులకు తీరని దుఃఖాన్ని మిగిల్చిందని పేర్కొన్నారు. వారి సేవలను కొనియాడుతూ.. వారి సందేశ స్ఫూర్తితో ముందుకుసాగాలని తెలిపారు.



## తెలంగాణ వేడుకలకు కేసీఆర్‌ను ఆహ్వానిస్తున్నాం

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్: తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు తమ ప్రభుత్వం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఆహ్వానిస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ భవన్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో ప్రజల ఆకాంక్షల మేరకే ప్రభుత్వ పాలన ఉంటోందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. మన రాష్ట్ర చిహ్నంలో అమరవీరుల స్థూపం ఉంటే కేటీఆర్‌కు ఇబ్బందేమిటని ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరితో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. కానీ బీఆర్ఎస్ హయాంలో అఖిలపక్షం నిర్వహించారా? అని ప్రశ్నించారు. ప్రజల కోరిక మేరకు రాష్ట్ర చిహ్నంలో మార్పులు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. లోటుపాట్లు, అభ్యంతరాలు లేకుండా చిహ్నం రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. దశాబ్ది వేడుకలకు అమరవీరుల కుటుంబాలను పిలిచి సముచితస్థానంలో సత్కరిస్తామన్నారు. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వారందరికీ గౌరవం దక్కాలని తమ ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఉద్యమంలో పాల్గొన్న వారందరికీ ఆహ్వానం ఉంటుందని స్పష్టం చేశారు. అన్నీ తానే అన్నట్లు కేసీఆర్ ప్రజల్లో భ్రమలు కల్పించారని విమర్శించారు.



## ఆసుపత్రుల్లోని క్యాంటీన్లకు బిల్లులు చెల్లించరేం..

- రూ.20 కోట్ల బిల్లులు చెల్లించలేదని మండిపాటు
- రోగులు, డాక్టర్లకు ఆహారం అందటం లేదన్న హరీశ్‌రావు
- వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్

హైదరాబాద్ : ఆసుపత్రుల్లో క్యాంటీన్లకు రూ. 20 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించలేదని దీంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రోగులతో పాటు డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది కూడా అవస్థలు పడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రోగులకు, డాక్టర్లకు ఆహారం అందటం లేదని వాపోయారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్యాంటీన్లకు బకాయిలు చెల్లించకపోవడంతో పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారని ఓ పత్రికా కథనాన్ని ఆయన తన ట్వీట్‌లో అటాచ్ చేశారు.

## కౌంటింగ్ వేళ.. రేవంత్ నిర్ణయమే ఫైనల్!

హైదరాబాద్, జర్నలిస్ట్ ఫైల్

రాష్ట్ర విభజన పూర్తయి పదేళ్లు అవుతోంది. ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య ఆస్తుల విభజన పూర్తి కావాల్సి ఉంది. జూన్ రెండో తేదీతో ఉమ్మడి రాజధానిగా పదేళ్ల కాలం పూర్తవుతుంది. భవనాలను స్వాధీనం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోనే అధికారులను ఆదేశించారు. తమకు కేటాయించిన భవనాలను మరికొంత కాలం కొనసాగించాలని ఏపీ ప్రభుత్వం ఇప్పటికే కోరింది. దీని పైన సీఎం రేవంత్ నిర్ణయం తీసుకోన్నారు.





### విభజనకు పదేళ్లు

హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన భవనాల విషయంలో త్వరలో స్పష్టత రానుంది. విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ నగరం పదేళ్ల పాటు రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాష్ట్రంగా ఉండాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కార్యకలాపాలు పూర్తిగా అక్కడకు తరలిన తర్వాత హైదరాబాద్‌లో ఆ రాష్ట్ర అవసరాల కోసం కొన్ని భవనాలను కేటాయించారు. రాజ్‌భవన్ రోడ్‌లో ఉన్న లేక్‌వ్యూ అతిథిగృహం, లక్డీకాపుల్‌లో పోలీసు విభాగానికి చెందిన సీఐడీ భవనంతో పాటు ఆదర్శనగర్‌లోని హెర్మిటేజ్ కాంప్లెక్స్‌ను ఏపీ అవసరాల కోసం కేటాయించారు. ఇప్పటి వరకు ఆ భవనాలు పూర్తిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలోనే ఉన్నాయి.

### ఏపీ భవనాల స్వాధీనం

ఏపీ కార్యకలాపాల కోసం వాటిని వినియోగిస్తున్నారు. మంత్రులు, ఇతరులు, అధికారులు, ఇతరత్రా అవసరాల కోసం వాడుతున్నారు. జూన్ రెండో తేదీతో పదేళ్ల కాలం పూర్తవుతున్నందున ఉమ్మడి రాజధాని అన్న అంశం ఉండదు. దీంతో ఆ భవనాలన్నింటినీ స్వాధీనం చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలోనే అధికారులకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాత్రం ఆ భవనాలను కొన్నాళ్ల పాటు తమకే కొనసాగించాలని తెలంగాణను కోరింది. ఈ మేరకు ఏపీ నుంచి గతంలోనే లిఖితపూర్వకంగా విజ్ఞప్తి వచ్చింది.

దానిపై తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఉన్న ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణా కమిషన్ కార్యాలయాన్ని ఇటీవలే కర్నూలుకు తరలించారు

### రేవంత్ దే తుది నిర్ణయం

భవనాల స్వాధీనం సహా విభజన అంశాలపై మంత్రివర్గంలో చర్చించాలని సీఎమ్?రేవంత్ రెడ్డి తొలుత భావించారు.

ఈసీ అభ్యంతరంతో నిర్ణయం వాయిదా పడింది. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఈ అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. లేక్ వ్యూ అతిథి గృహం అవసరం చాలా ఉందని తెలంగాణ ప్రభుత్వ వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వ అతిథులు, కేంద్ర మంత్రులు, ఉన్నతాధికారులు హైదరాబాద్ వస్తే ప్రస్తుతం సరైన వసతి లేదని, హోటళ్లలో వసతి కల్పించాల్సి వస్తోందని చెప్తున్నారు. దీంతో..ఏపీ ప్రభుత్వ రిక్వెస్ట్ పై రేవంత్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది చూడాలి.



## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన సీఎం రేవంత్ కీలక నిర్ణయం..!!

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ కీలక నిర్ణయం తీసుకున్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన తరువాత తొలి సారి జరుగుతున్న ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. ఇందు కోసం ప్రభుత్వం షెడ్యూల్ ఖరారు చేసింది. కాంగ్రెస్ అగ్రనేత సోనియా ఈ సారి ఆవిర్భావ వేడుకలకు హాజరు కానున్నారు. మాజీ సీఎం కేసీఆర్ తో సహా ఉద్యమ కారులను వేడుకలకు సీఎం రేవంత్ ఆహ్వానించారు. దీంతో, ఈ సారి జూన్ 2 రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణం కనిపించనుంది. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఈసారి ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఘనంగా వేడుకలకు ఏర్పాట్లు చేశారు. జూన్ 2న ఉదయం 9.30కు గన్ పార్క్‌లో అమర వీరుల స్థూపం వద్ద సీఎం రేవంత్ తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరులైన వారికి నివాళులు అర్పిస్తారు. ఆరోజు ఉదయం 10 గంటలకు పెరేడ్ గ్రౌండ్లో ముఖ్యమంత్రి జాతీయ పతాకావిష్కరణ చేస్తారు. పోలీసు బలగాల పరేడ్, మార్చ్ ఫాస్ట్, వందన స్వీకార కార్యక్రమం ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర అధికారిక గీతాన్ని ఆవిష్కరిస్తారు. సోనియా ప్రసంగం పెరేడ్ గ్రౌండ్ లో సభలో సోనియాగాంధీ ..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తారు. పోలీసు సిబ్బందికి, ఉత్తమ కాంటింజెంట్లకు అవార్డులను ప్రదానం చేస్తారు. అవార్డు స్వీకర్తలతో ఫోటో సెషన్ అనంతరం కార్యక్రమం ముగుస్తుంది. సాయంత్రం ట్యాంక్ బండ్‌పై తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ప్రారంభమవుతాయి. తెలంగాణకు సంబంధించిన హస్తకళలు, ప్రత్యేక ఉత్పత్తులు, వివిధ రకాల ఫుడ్ స్టాల్స్ ట్యాంక్ బండ్‌పై ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం 6.30కు ముఖ్యమంత్రి ట్యాంక్ బండ్‌కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శిస్తారు. అనంతరం తెలంగాణ కళారూపాల అద్భుత ప్రదర్శనకు అద్దం పట్టే కార్నివాల్ నిర్వహిస్తారు. భారీ ఏర్పాట్లు ట్యాంక్ బండ్ ఏర్పాటు చేసిన వేదికపై 70 నిమిషాల పాటు వివిధ సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఉంటాయి. స్టేజ్ షో అనంతరం జాతీయ జెండాలతో ట్యాంక్ బండ్పై ఇటు చివర నుంచి అటు చివరి వారకు భారీ ఫ్లాగ్ వాక్ నిర్వహిస్తారు. దాదాపు 5 వేల మంది ఇందులో పాల్గొంటారు. ఈ ఫ్లాగ్ వాక్ జరుగుతున్నంత సేపు జయ జయహే తెలంగాణ ఫుల్ వర్షన్ (13.30 నిమిషాల) గీతాన్ని విడుదల చేస్తారు. అదే వేదికపై తెలంగాణ కవి అందెశ్రీ, సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణికి సన్మానం చేస్తారు. రాత్రి 8.50 గంటలకు పది నిమిషాల పాటు హుస్సేన్ సాగరం మీదుగా ఆకాశంలో రంగులు విరజిమ్మేలా బాణాసంచా కార్యక్రమంతో వేడుకలను ముగిస్తారు.

## గ్రూప్ 1 పరీక్షను వాయిదా వేయండి

### బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

హైదరాబాద్ : టీఎస్‌పీఎస్సీ నిర్వహించే గ్రూప్-1 పరీక్ష వాయిదా వేయాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. జూన్ 9వ తారీఖున జరగబోయే గ్రూప్-1 ఎగ్జామ్‌ను కనీసం ఒక నెల అయినా వాయిదా వేస్తే బాగుంటుందని తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా టీఎస్‌పీఎస్సీకి విజ్ఞప్తి చేశారు.

ఎందుకంటే అదే రోజు కేంద్ర ప్రభుత్వ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) ఇన్‌స్పెక్టర్ ఎగ్జామ్ కూడా ఉంది. దానికి చాలా మంది తెలంగాణ నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. అలాగే చాలా మంది ప్రభుత్వ ఉద్యోగులు (రెవెన్యూ, పోలీసు) గత నాలుగు నెలల నుండి ఎన్నికల నిర్వహణలో తలమునకలైనందు వల్ల వాళ్లకు బాగా ప్రిపేర్ అయ్యే అవకాశం దొరకలేదు. కాబట్టి వాళ్లకు ఒక నెలైనా సమయం ఇస్తే.. కనీసం లాస్ ఆఫ్ పే సెలవు మీద చదువుకుని పరీక్షకు హాజరవుతారని తెలిపారు.

ఈ విషయంలో సాధ్యాసాధ్యాలు పరిశీలించి గత ఎనిమిదేళ్లుగా గ్రూప్-1 కోసం ఎదురుచూస్తున్న అందరు నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం జరిగేలా నిర్ణయం తీసుకోవాలని బోర్డును కోరారు. అలాగే అన్ని జాగ్రత్తలు తీసుకొని పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని బీఆర్ఎస్ పార్టీ తరుపున ఆయన అభ్యర్థించారు. అదే విధంగా ఏఈఈ పరీక్ష రాసిన అభ్యర్థులు ఎంతో కాలంగా నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి వెంటనే న్యాయం చేయాలని ప్రవీణ్ కుమార్ కోరారు.



## వేలాది బిడ్డల్ని చంపిన బలిదేవత ఎవరు?: కేటీఆర్

- 'ఎక్స్' వేదికగా కాంగ్రెస్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు
- ప్రత్యేక రాష్ట్రం పదేళ్లు తాత్సారం చేసి వందలాది మంది ఆత్మబలిదానానికి కారణం ఎవరంటూ నిలదీత
- 1952లో సిటీ కాలేజీ వద్ద ఆరుగురు విద్యార్థులను బలి తీసుకుందెవరు? అని ప్రశ్నించిన కేటీఆర్
- 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మందిని కాల్చి చంపింది ఎవరు? అంటూ ఫైర్

హైదరాబాద్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా మరోసారి కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. "ప్రత్యేక రాష్ట్రం పదేళ్లు తాత్సారం చేసి వందలాది మంది ఆత్మబలిదానానికి కారణం ఎవరు? కాంగ్రెస్ ప్రభుత్వం. 1952లో ఉమ్మడి రాష్ట్రం వద్దని, హైదరాబాద్ స్టేట్ ప్రత్యేక రాష్ట్రంగానే ఉండాలని పోరాటం చేస్తున్న విద్యార్థులపై సిటీ కాలేజీ వద్ద కాల్పులు జరిపి ఆరుగురిని బలిగొన్నది ఎవరు? కాంగ్రెస్ ప్రభుత్వం. 1969-71 తొలిదశ ఉద్యమంలో 370 మందిని కాల్చి చంపింది ఎవరు? కాంగ్రెస్ ప్రభుత్వం.

దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజాస్వామికంగా, తమ ఆకాంక్షను వ్యక్తం చేస్తే, తెలంగాణను తుంగలో తొక్కింది ఎవరు? కాంగ్రెస్ ప్రభుత్వం. రేవంత్ రెడ్డి స్వయంగా చెప్పినట్టు, వేలాది తెలంగాణ బిడ్డలను చంపిన బలిదేవత ఎవరు?" అని ప్రశ్నిస్తూ అమరవీరుల స్తూపం ఫొటోను పోస్ట్ చేశారు. కేటీఆర్ చేసిన ఈ ట్వీట్ ఇప్పుడు నెట్టింట్ వైరల్ అవుతోంది.



## తెలంగాణలో బీర్ల కొరత లేదు

హైదరాబాద్ : తెలంగాణలో బీర్ల కొరత ఏర్పడిందంటూ వస్తున్న వార్తలపై రాష్ట్ర ఎక్సైజ్ శాఖ స్పందించింది. తెలంగాణలో బీర్ల కొరత లేదని, కేవలం కింగ్ ఫిషర్ బ్రాండ్ కొరత తప్ప.. మిగతా అన్ని రకాల బీర్లు అందుబాటులో ఉన్నాయని ఎక్సైజ్‌శాఖ తెలిపింది. తెలంగాణలో బీరు తయారు చేసే బ్రూవరీస్ కంపెనీలకు మూడో షిఫ్టు అనుమతించక పోవడంతో కృత్రిమ కొరత ఏర్పడిరదని మీడియాలో వచ్చిన కథనం సత్యదూరమని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్టుమెంట్ కమిషనర్ శ్రీధర్ వెల్లడించారు. 'ప్రస్తుతం తెలంగాణలో ఆరు బీరు తయారు చేసే బ్రూవరీస్ కంపెనీలు ఉన్నాయి. ప్రభుత్వ అనుమతి ఉన్న బీరు తయారీ కంపెనీలు లైసెన్స్ షరతుల ప్రకారమే ఉత్పత్తి చేయడానికి అనుమతి ఉంటుంది. సాదారణంగా ఒక షిఫ్టుకు అనుమతి ఉంటుంది. కానీ బీరు డిమండ్ మేరకు.. బ్రూవరీస్ అభ్యర్ధనను పరిగణలోకి తీసుకొని అవసరమైన రుసుం చెల్లించిన వారికి మూడు షిఫ్టులకు అనుమతి ఇవ్వడం జరిగింది. ఆరు బ్రూవరీస్‌లో, నాలుగు బ్రూవరీస్ 95 శాతం వారి డిమాండ్ కలిగిన బ్రాండ్స్ ఉత్పత్తి చేస్తాయి. బీరు ఉత్పత్తి కంపెనీలు చేసే నాలుగు కంపెనీలకు మూడు షిఫ్టులకు అనుమతి తీసుకున్నారు' అని పేర్కొన్నారు. "డిమాండ్ ఉన్న నాలుగు కంపెనీల రోజు వారి ఉత్పత్తి సామర్థ్యం 1,66,000 కేసులు. ఇలా మూడు షిఫ్టుల్లో 4,98,000 కేసులు తయారు చేయాల్సి ఉంటుంది. కానీ మూడు షిఫ్టులు నడుపుకోవడానికి అనుమతి తీసుకున్న కంపెనీలు మూడు షిఫ్టుల్లో కేవలం 2.51 లక్షల కేసుల బీరును మాత్రమే ఉత్పత్తి చేశాయి. తెలంగాణలో వేసవిలో బీరు సరాసరి రోజుకు 2.00 లక్షల కేసులు అమ్మకాలు జరుగుతాయి. ఇప్పటి వరకు 7.57 లక్షల కేసుల బీరు కేసులు బ్రెవరీస్ కార్పొరేషన్ డిపోల్లో, బ్రూవరీస్‌లో నిల్వలు ఉన్నాయి. మొత్తంగా మార్కెట్‌లో బీరు కొరత లేదు' అని వెల్లడించింది. 'కింగ్ ఫిషర్ బ్రాండ్ కొరత తప్ప మిగిలిన అన్ని రకాలు బీర్లు అందు బాటులో ఉన్నాయి. బీరు తయారు చేసే కంపెనీలు మూడు షిఫ్టుల అనుమతి తీసుకున్నా కూడా తగిన బీరు ఉత్పత్తి చేయలేకపోవడం వల్ల కింగ్ ఫిషర్ బీరు కొరత ఏర్పడింది. అయినప్పటికి ఎక్సైజ్ శాఖ యంత్రాంగం అన్ని రకాల చర్యలు తీసుకొని బీరు నిల్వలకు కొరత లేకుండా చూశారు' అని ఎక్సైజ్ శాఖ అధికారి స్పష్టం చేశారు. ఇక తెలంగాణలో కొత్త బ్రాండ్‌ల అనుమతికి సంబంధించి గతంలో నుంచి కొనసాగుతున్న పద్ధతినే కొనసాగిస్తున్నామని తెలిపింది. గత ఐదేళ్లలో తెలంగాణలో దాదాపు 360 కొత్త మద్యం బ్రాండ్లకు అనుమతి ఇవ్వడం జరిగింది. గడిచిన ఐదు నెల్లలో నాలుగు బీరు బ్రాండ్స్‌ను సరఫరా చేసేందుకు కార్పొరేషన్ వద్ద రిజిస్ట్రేషన్ చేసుకున్నారని వెల్లడించారు.

# ఢిల్లీలో దాహం..దాహం..



### అదనపు నీటి కోసం సుప్రీంకోర్టుకెక్కిన ఆప్ ప్రభుత్వం!

### హర్యానా, యూపీ, హిమాచల్ ప్రదేశ్ నుంచి అదనంగా నీటిని ఇప్పించాలని వినతి

### పిటిషన్ దాఖలు చేసిన ఆప్ సర్కార్

### దేశ రాజధాని దాహం తీర్చడం ప్రతి ఒక్కరి బాధ్యతని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో నీటి ఎద్దడి తీవ్రమైంది. ఎండలు భగ్గుమంటుండటంతో రోజువారీగా సరఫరా చేస్తున్న నీరు ప్రజలకు ఏమాత్రం సరిపోవడంలేదు. దీంతో కేజ్రీవాల్ ప్రభుత్వం ఏకంగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. పొరుగు రాష్ట్రాలైన హర్యానా, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ నుంచి అదనపు నీటిని అందించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేసింది.

'ఎండల వల్ల ఢిల్లీ నీటి అవసరాలు గణనీయంగా పెరిగాయి. దేశ రాజధాని దాహం తీర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత' అని పిటిషన్ లో కేజ్రీవాల్ ప్రభుత్వం పేర్కొంది.

ఢిల్లీలో కొన్ని రోజులుగా నీటి సమస్య అధికమైంది. ముఖ్యంగా చాణక్యపురిలోని సంజయ్ క్యాంప్ ప్రాంతంతోపాటు గీతా కాలనీ, మరికొన్ని చోట్ల ప్రజలు నీరు లేక అల్లాడుతున్నారు.

కనీసం ఒక్క బకెట్ నీరు దొరుకుతుందన్న ఆశతో నీళ్ల ట్యాంకర్ల వద్ద ఎండలోనే పడిగాపులు కాస్తున్నారు. కానీ నీటి ట్యాంకర్లు మాత్రం అన్ని ప్రాంతాలకూ సరఫరా చేయకుండానే తిరిగి వెళ్లిపోతున్నాయి. ఢిల్లీలో రెండు రోజుల కిందట ఉష్ణోగ్రతలు దాదాపు 50 డిగ్రీలకు చేరడంతో నీటి కొరత ఎక్కువైంది. కనిష్ట ఉష్ణోగ్రతలు సైతం 30 డిగ్రీల సెల్సియస్ గా నమోదవుతున్నాయి. ఇది సాధారణంకన్నా 2.8 డిగ్రీలు ఎక్కువ కావడం గమనార్హం. మరోవైపు ఢిల్లీలో వడగాడ్పులు మరికొన్ని రోజులపాటు కొనసాగుతాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

అందువల్ల ప్రజలు ఎండల్లో బయటకు తిరగరాదని సూచించింది. అలాగే ఎప్పుడూ తగినంత నీరు తాగుతుండాలని తెలిపింది.

నీటి వృథాను అరికట్టేందుకు కేజ్రీవాల్ ప్రభుత్వం బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. కార్లు కడగడం లాంటివి చేసే వారికి రూ. 2 వేల చొప్పున జరిమానా విధించాలని నిర్ణయించింది. జరిమానాల వసూలు కోసం ఢిల్లీవ్యాప్తంగా 200 బృందాలను రంగంలోకి దింపింది.

# సెక్స్ స్కాండల్ కేసు.. సిట్ అదుపులో ఎంపీ

**పలువురు మహిళలపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడినట్లు సంచలన ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరు పోలీసులు గురువారం అర్ధరాత్రి దాటాక అరెస్ట్ చేశారు. జర్మనీ నుంచి బయలుదేరి బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన ఆయనను సిట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం భారీభద్రత మధ్య విచారణ నిమిత్తం సీఐడీ కార్యాయానికి తరలించారు.**



**బెంగళూరు :** జర్మనీ నుంచి బయలుదేరి బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన ఆయనను సిట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల సందడి వేళ కర్ణాటక రాజకీయాల్లో ప్రజ్వల్ రేవణ్ణ వ్యవహారం తీవ్ర సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం అటు కర్ణాటక రాజకీయాలతో పాటు కేంద్రంలోని బీజేపీకి తలనొప్పిగా మారిన పరిస్థితి అనేకామెంట్లు వినిపించాయి. ఈ సమయంలో ఈ కేసులో అనూహ్యపరిణామం చోటు చేసుకుంది. ఇందులో భాగంగా ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను సిట్ పోలీసులు అరెస్ట్ చేశారు. పలువురు మహిళలపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడినట్లు సంచలన ఆరోపణలు ఎదుర్కొంటున్న జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణను బెంగళూరు పోలీసులు గురువారం అర్ధరాత్రి దాటాక అరెస్ట్ చేశారు. జర్మనీ నుంచి బయలుదేరి బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగిన ఆయనను సిట్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం భారీభద్రత మధ్య విచారణ నిమిత్తం సీఐడీ కార్యాయానికి తరలించారు. కాగా... పలువురు మహిళలపై ప్రజ్వల్ రేవణ్ణ లైంగిక దాడి చేసినట్లు వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టిన సంగతి తెలిసిందే. దీంతో... ఆయన గత ఏప్రిల్ లో దేశం విడిచి పరారయ్యారు. ఈ సందర్భంగా జర్మనీ వెళ్లినట్లు కథనాలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు ఆయనపై మూడు కేసులు నమోదు అయ్యాయి. ఈ నేపథయంలో ప్రజ్వల్ జాడ కోసం పోలీసులు ముమ్మరంగా గాలించారు. ఈ క్రమంలోనే ఆయనపై నాలుగుసార్లు నోటీసులు, ఒక అరెస్టు వారెంటు, బ్లూ కార్నర్, రెడ్ కార్నర్ నోటీసులు కూడా జారీ అయ్యాయి. ఇదే సమయలో కర్ణాటక సీఎం ఈ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖ కూడా రాశారు. ఈ నేపథ్యంలో ప్రజ్వల్ దౌత్య పాస్ పోర్టు రద్దు చేసేందుకు కేంద్ర విదేశాంగ శాఖ చర్యలు చేపట్టింది! ఈ నేపథ్యంలో విచారణకు హాజరు కావాలంటూ ఆయన కుటుంబ సభ్యులు బహిరంగంగానే కోరారు. ఇందులో భాగంగా... ఆయన తండ్రి హెచ్.డీ. రేవణ్ణ, మాజీ ముఖ్యమంత్రి హెచ్.డీ. కుమారస్వామి, మాజీ ప్రధాని హెచ్.డీ. దేవెగౌడ ఈ విషయంలో ప్రజ్వల్ ను బహిరంగానే కోరారు. ఈ నేపథ్యంలో ప్రజ్వల్ స్పందించారు. ఇందులో భాగంగా తనపై నమోదైన కేసుల విచారణకు సహకరిస్తానని తెలిపారు. మే 31న సిట్ ముందు హాజరవుతానని వీడియో సందేశంలో వెల్లడించారు. ఈ క్రమంలోనే గురువారం అర్ధరాత్రి దాటాక ఆయన బెంగళూరుకు చేరుకోవడం.. ఆయన విమానాశ్రయానికి చేరుకోగానే సిట్ అధికారులు ఆయనను అదుపులోకి తీసుకోవడం జరిగిపోయింది. మరోవైపు బెంగళూరు కోర్టులో రేవణ్ణకు ఎదురుదెబ్బ తగిలింది. ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్ ను ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం తిరస్కరించింది.



## విమానంలో ఏసీ లేక 8 గంటల పాటు ప్రయాణికుల నరకయాతన

- ఢిల్లీ ఎయిర్‌పోర్టులో ఎయిరిండియా విమానంలో ఘటన
- శాన్‌ఫ్రాన్‌సిస్కో వెళ్లాల్సిన విమానం టేకాఫ్‌లో జాప్యం
- 8 గంటల పాటు ఏసీ లేకుండా విమానంలోనే ప్రయాణికులు
- మహిళా ప్రయాణికురాలి ఫిర్యాదు, క్షమాపణలు చెప్పిన ఏఐ

**న్యూఢిల్లీ :** విమానం బయలుదేరడంలో జాప్యం కారణంగా ప్రయాణికులు ఇబ్బందుల పాలయ్యారు. ఎనిమిది గంటల పాటు విమానంలోనే ఉండిపోయిన వారు ఏసీ కూడా లేక నరకయాతన అనుభవించారు. ఢిల్లీ ఎయిర్ పోర్టులో ఈ ఘటన వెలుగు చూసింది. తమ ఇబ్బందుల గురించి తెలియజేస్తూ ఓ ప్రయాణికురాలు నెట్టింట పోస్టు పెట్టారు. గురువారం ఉదయం 11 గంటలకు శాన్‌ఫ్రాన్‌సిస్కోకు బయలుదేరాల్సిన ఎయిర్ ఇండియా విమానం 20 గంటల ఆలస్యంగా బయలుదేరిందన్నారు. తమను విమానంలోనే కూర్చునేలా చేశారని వాపోయారు. కనీసం ఏసీ కూడా లేకపోవడంతో ఎనిమిది గంటల పాటు నరకం కనిపించిందన్నారు. ఉక్కపోత వేడి తట్టుకోలేక కొందరు సొమ్మసిల్లిపోవడంతో తమను బయటకు పంపించారని చెప్పారు. ఎయిర్ ఇండియా పనితీరుపై తీవ్ర విమర్శలు చేసిన ఆమె పౌర విమానయాన శాఖమంత్రిని తన పోస్టులో ట్యాగ్ చేశారు. ఎయిర్ ఇండియా విషయంలో ప్రైవేటీకరణ దారుణంగా విఫలమైందని అన్నారు. ప్రయాణికులను ఇన్ని ఇబ్బందులకు గురి చేయడం అమానవీయమని వ్యాఖ్యానించారు. కాగా, ప్రయాణికుల ఫిర్యాదుపై ఎయిర్ ఇండియా స్పందించింది. వారికి క్షమాపణలు చెప్పింది. ప్యాసెంజర్లకు కావాల్సిన సహాయసహకారాలు అందిస్తున్నామని పేర్కొంది. ఢిల్లీలో ప్రస్తుతం తీవ్ర వడగాలులు వీస్తున్న విషయం తెలిసిందే. బుధవారం అక్కడ ఉష్ణోగ్రత 52.9 డిగ్రీలను తాకింది. రాజస్థాన్ నుంచి వేడి గాలులు వీస్తుండటంతో ఢిల్లీలో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది.

## బంగారం స్మగ్లింగ్.. ఎయిర్ హోస్టెస్ అరెస్టు

**కన్నూరు :** బంగారం స్మగ్లింగ్ చేస్తూ ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ఎయిర్ హోస్టెస్ దొరికిపోయింది. 960 గ్రాముల బంగారాన్ని ఆమె రహస్య అవయవాల్లో దాచుకుని వస్తుండగా కేరళలోని కన్నూరు విమానాశ్రయంలో అరెస్ట్ చేసినట్టు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు తెలిపారు.

నిందితురాలిని సురభి ఖాతూన్‌గా గుర్తించారు. ఈ నెల 28న విమానం మస్కట్ నుంచి కన్నూరు చేరుకుంది. ఆమె నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆమెను మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టగా 14 రోజుల కస్టడీకి ఆదేశించారు. నిందితురాలు సురభి బంగారాన్ని అక్రమంగా తీసుకురావడం ఇదే తొలిసారి కాదని, గతంలోనూ పలుమార్లు ఇలా స్మగ్లింగ్ చేసినట్టు ప్రాథమిక విచారణలో తేలింది.

## హిందూ - ముస్లిం మతాంతర వివాహంపై కోర్టు సంచలన తీర్పు!



**మధ్య ప్రదేశ్ :** ఇటీవల కాలంలో కులాంతర, మతాంతర వివాహాలు పెరుగుతున్నాయని చెబుతున్న సంగతి తెలిసిందే. పైగా ఇది శుభపరిణామం అనేమాటలూ వినిపిస్తుంటాయి. అయితే తాజాగా మతాంతర వివాహంపై మధ్యప్రదేశ్ హైకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. ఇందులో భాగంగా... ముస్లిం యువకుడితో హిందూ యువతి వివాహం చెల్లదని తీర్పునిచ్చింది. అవును... మతాంతర వివాహం రిజిస్టర్ అయ్యేందుకు అనుమతి ఇవ్వాలని ఓ ప్రేమ జంట హైకోర్టును ఆశ్రయించింది.. 1954 చట్టం ప్రకారం తమ వివాహం రిజిస్టర్ చేసేందుకు పర్మిషన్ ఇవ్వాలంటూ మధ్యప్రదేశ్ హైకోర్టును కోరింది. ఇలా పోలీస్ రక్షణలో ప్రత్యేక వివాహం కోసం ఒక జంట చేసిన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. వివరాల్లోకి వెళ్తే... మధ్యప్రదేశ్ కు చెందిన ముస్లిం వ్యక్తి, హిందూ మహిళ పెళ్లి చేసుకోవాలని భావించారు. అయితే వారిద్దరూ తమ తమ మతాలను మాత్రం వదులుకోకుండా కలిసి జీవనం సాగించాలని నిర్ణయించారు. దీంతో పోలీస్ రక్షణ కల్పించడంతోపాటు ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం పెళ్లి చేసుకునేందుకు అనుమతించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. అయితే... ఈ జంట మతాంతర వివాహాన్ని సదరు మహిళ కుటుంబం కోర్టులో వ్యతిరేకించింది. వారిద్దరూ పెళ్లి చేసుకుంటే సమాజంలో తమ పరువుపోతుందని వాపోయింది. ముస్లిం వ్యక్తిని పెళ్లి చేసుకునేందుకు ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆమె.. తన వెంట నగలను కూడా తీసుకెళ్లిందని ఆమె కుటుంబం తరుఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. మరోవైపు.. వారిరువురూ తమ తమ తమ మతాలు మారలేదని.. సహజీవనం కూడా చేయలేదని.. ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం మతాంతర వివాహం చెల్లుబాటు అవుతుందని ఆ జంట తరుఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ముస్లిం వ్యక్తిగత చట్టాన్ని ప్రత్యేక వివాహ చట్టం అధిగమిస్తుందని వాదించారు. ఈ సమయంలో... ఇరు వర్గాల వాదనలు విన్న జస్టీస్ గుర్పాల్ సింగ్ అహ్లూవాలియా నేతృత్వంలోని ధర్మాసనం... ముస్లిం పురుషుడు, హిందూ మహిళ కలిసి ప్రత్యేక వివాహ చట్టం ప్రకారం వివాహం చేసుకున్నప్పటికీ.. ముస్లిం వ్యక్తిగత చట్టం ప్రకారం ఆ పెళ్లి చెల్లదని పేర్కొంది. ఆ జంట పిటిషన్ ను తిరస్కరించింది.

# మాపై చేతబడి - క్షుద్ర పూజలు

### డిప్యూటీ సీఎం డీకే సంచలన కామెంట్స్



**బెంగళూరు :** కేరళలో ప్రత్యేకంగా చేతబడి, క్షుద్ర పూజలు చేయడంలో దిట్టలైన మాంత్రికులను పెట్టి తమపై ఈ పూజలు చేయిస్తున్నట్టు తెలిసిందన్నారు. కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తనకు, రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ద రామయ్యకు కీడు తలపెడుతున్నారని.. ఈ క్రమంలో ఓ పార్టీ నేతలు తమపై చేతబడి సహా క్షుద్ర పూజ లు చేయిస్తున్నారని తెలిపారు. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఎప్పటి నుంచో కుట్ర చేస్తున్నవారే ఇలా చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. కేరళలో ప్రత్యేకంగా చేతబడి, క్షుద్ర పూజలు చేయడంలో దిట్టలైన మాంత్రికులను పెట్టి తమపై ఈ పూజలు చేయిస్తున్నట్టు తెలిసిందన్నారు. తాజాగా డీకే మీడియాతో మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం ఏర్పడడం కేంద్రంలోని నరేంద్ర మోడీకి రాష్ట్రం లోని జేడీఎస్‌కు ఏమాత్రం ఇష్టం లేదన్నారు. అందుకే తమ ప్రభుత్వం కూల్చేయాలని వారు కుట్రలు చేస్తున్నారని చెప్పారు. కేరళ మాంత్రికులు రహస్య ప్రాంతంలో తమపై చేతబడి, క్షుద్ర పూజలు చేస్తు న్నట్టు సమాచారం అందిందన్నారు. తమకు వ్యతిరేకంగా శత్రు భైరవి యాగం కూడా చేయిస్తున్నట్టు చెప్పారు. అయితే ఈ క్షుద్ర పూజలను తాము పట్టించుకోబోమని తెలిపారు. తాము ప్రజలనే నమ్ముకున్నామని.. పూజలను కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఏడాది కాలంగా సుపరిపాలన సాగుతోందని డీకే చెప్పారు. దీనిని చూసి ఓర్చుకోలేక పోతున్నార ని బీజేపీ, జేడీఎస్‌లపై ఆయన విమర్శలు గుప్పించారు. %--%నేను, ముఖ్యమంత్రి సిద్దరామయ్య, కాంగ్రెస్ పార్టీ నాశనం కావాలని వారు(బీజేపీనా, జేడీఎస్సా అన్నది క్లారిటీ ఇవ్వలేదు) కేరళలో క్షుద్ర పూజలు, చేతబడులు చేయిస్తున్నారు. కేరళలోని రాజరాజేశ్వరి దేవాలయం చుట్టుపక్కల ఉన్న నిర్జన ప్రాంతంలో శత్రువులను చంపేందుకు చేసే రాజకంటకం, మరన్ మోహన స్తంభన యాగం చేస్తున్నారని డీకే వ్యాఖ్యానించారు. ఈ యాగం, క్షుద్ర పూజల్లో భాగంగా పంచబలి సమర్పిస్తున్నారని తనకు సమాచారం ఉందని డీకే తెలిపారు. 21 ఎర్ర రంగు మేకలు, 3 గేదెలు, 21 నల్ల రంగు గొర్రెలు, 5 పందులను బలి ఇస్తున్నట్టు తనకు పక్కాగా సమాచారం ఉందన్నారు. అయితే.. తాము ఈ యాగాలకు, పూజలకు భయపడేది లేదన్నారు. ప్రజలను నమ్ముకున్నామని.. ప్రజలతోనే ఉన్నామని చెప్పారు.

## జాతీయ వార్తలు



## ధ్యానంలో ప్రధాని మోదీ..

- తమిళనాడులోని కన్యాకుమారి పర్యటనకు వెళ్లిన మోదీ
- ఇక్కడి రాక్ మెమోరియల్ వద్ద 45 గంటలు ధ్యానం చేయనున్న ప్రధాని
- ధ్యానానికి ముందు భగవతీ అమ్మన్ ఆలయంలో మోదీ ప్రత్యేక పూజలు

**కన్యాకుమారి :** తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రధాని నరేంద్ర మోదీ ధ్యానం కొనసాగుతోంది. స్వామి వివేకానంద ధ్యానం చేసిన వివేకానంద రాక్ మెమోరియల్‌లో మోదీ మెడిటేషన్ కొనసాగిస్తున్నారు. గురువారం సాయంత్రం ధ్యాన ముద్రలోకి వెళ్లిన ఆయన.. శనివారం మధ్యాహ్నం వరకు అంటే దాదాపు 45 గంటల పాటు ఇక్కడే రేయింబవళ్లు ధ్యానం చేయనున్నారు.

అంతకుముందు తాను పోటీ చేస్తున్న వారణాసి లోక్ సభ స్థానంలో ప్రచారం ముగించుకున్న ప్రధాని నరేంద్ర మోదీ తమిళనాడులోని కన్యాకుమారి చేరుకున్నారు. అక్కడ ఆయన ముందుగా భగవతీ అమ్మన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ప్రదక్షిణ చేసి కొబ్బరికాయ, అరటిపండ్లు సమర్పించారు. ఆలయ పూజారులు ప్రధానికి అమ్మవారి చిత్రపటం అందజేశారు. ఇక ప్రధాని మోదీ పర్యటన సందర్భంగా కన్యాకుమారిలో అధికారులు ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా, 2019 ఎన్నికలు ముగిశాక కేదార్‌నాథ్ గుహల్లో ధ్యానం చేసిన ప్రధాని.. ఈసారి తమిళనాడు కన్యాకుమారిలోని వివేకానంద రాక్ మెమోరియల్‌ను ఎంచుకున్నారు.



## ఫోన్ లాక్కున్నాడని భర్తకు కరెంట్ షాక్

- ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురీలో ఘటన
- నిత్యం మొబైల్‌లో గడుపుతున్న భార్య ఫోన్ తీసుకున్న భర్త
- దీంతో కోపం పెంచుకున్న ఆమె.. భర్తకు చిత్రహింసలు

**మెయిన్‌పురీ :** త్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురీలో అమానవీయ ఘటన జరిగింది. నిత్యం మొబైల్‌లో గడుపుతున్న భార్య ఫోన్‌ను భర్త తీసుకున్నాడు. దీంతో కోపం పెంచుకున్న ఆమె.. భర్తకు కరెంట్ షాక్ ఇచ్చింది. మొదట భర్తకు మత్తుమందు ఇచ్చి మంచానికి కట్టేసింది. ఆ తర్వాత ఎలక్ట్రిక్ షాక్ ఇస్తూ కొడుతూ రాక్షసత్వం ప్రదర్శించింది. తండ్రిని కాపాడేందుకు ప్రయత్నించిన 14 ఏళ్ల కుమారుడిపైన కూడా చేయి చేసుకుంది. ఎలాగోలా అక్కడి నుంచి తప్పించుకున్న బాధితుడు ప్రదీప్‌సింగ్ పోలీసులను ఆశ్రయించాడు. ప్రస్తుతం అతడు సైఫాయి మెడికల్ కాలేజీలో చికిత్స పొందుతున్నాడని అధికారులు తెలిపారు. కాగా, 2007లో ఔరయ్యకు చెందిన దివాన్ సింగ్ కుమార్తె బేబీ యాదవ్‌తో ప్రదీప్‌సింగ్‌కు వివాహమైంది.

బాధితుడు తన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. "నా భార్య తన మొబైల్ ఫోన్‌లో ప్రతిరోజూ ఎవరితోనో మాట్లాడేది. ఈ విషయమై నేను అభ్యంతరం వ్యక్తం చేశాను. అలాగే ఈ విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు కూడా తెలియజేశాను. వారి సూచన మేరకు నేను ఆమె వద్ద నుంచి మొబైల్ ఫోన్ తీసుకున్నాను. ఇది ఆమెకు కోపం తెప్పించింది. ఫోన్ ఇచ్చేయాలని మొదట ఆమె నన్ను బెదిరించింది. ఈ క్రమంలో నన్ను, నా కొడుకును చంపేస్తానని బెదిరింపులకు పాల్పడింది. ఆపై ఆమె నన్ను క్రికెట్ బ్యాట్‌తో పదే పదే కొట్టడం చేసింది. నా కొడుకు జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించడంతో ఆమె నాకు కరెంట్ షాక్ ఇచ్చింది. నన్ను రక్షించడానికి యత్నించిన కుమారుడిపై కూడా దాడి చేసింది" అని ప్రదీప్‌సింగ్ తెలిపాడు. కిష్ని పోలీస్ స్టేషన్ అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. భర్తపై వేధింపులకు పాల్పడిన బేబీ యాదవ్‌పై ఐపీసీ సెక్షన్లు 307 (హత్యకు ప్రయత్నించడం), 328 (నేరం చేయాలనే ఉద్దేశ్యంతో విషం ద్వారా గాయపరచడం మొదలైనవి), 506 (నేరపూరిత బెదిరింపు) కింద కేసు నమోదు చేశామన్నారు. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితురాలి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

## ఎల్లుండి లొంగిపోతున్నా...

### అరవింద్ కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** జైల్లో తనను ఎన్ని వేధింపులకు గురి చేసినా తలవంచేది లేదని... ఈసారి జైలుకు వెళ్లిన తర్వాత మరింత వేధింపులకు గురిచేసేలా ప్రయత్నాలు జరగవచ్చునని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. మద్యం పాలసీ కేసులో అరెస్టైన కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. ఆయన రెండో తేదీన కోర్టు ఎదుట లొంగిపోవాల్సి ఉంది. ఈ క్రమంలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... తాను ఎల్లుండి లొంగిపోనున్నట్లు చెప్పారు. జూన్ 2న తాను లొంగిపోయిన తర్వాత ఈసారి మరెంతకాలం జైల్లో ఉంటానో తెలియదన్నారు. నియంతృత్వం నుంచి ఈ దేశాన్ని కాపాడేందుకు తాను జైలుకు వెళుతున్నందుకు గర్వంగా ఉందన్నారు. తాను జైల్లో ఉన్నప్పుడు మెడిసిన్ అందకుండా అడ్డుపడ్డారని... దీంతో అరెస్టైనప్పుడు 70 కిలోలు ఉన్న తాను... ఆరు కిలోలు తగ్గినట్లు చెప్పారు. కొన్ని వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు తనకు సూచించారని... అంతర్గతంగా ఉన్న తన ఆరోగ్య పరిస్థితికి ఇది సంకేతం కావొచ్చునని వ్యాఖ్యానించారు.

ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు ఇంటి నుంచి బయలుదేరి పోలీసుల ఎదుట లొంగిపోతానని కేజ్రీవాల్ తెలిపారు. ఈసారి తనను ఇంకా వేధింపులకు గురి చేయవచ్చునన్నారు. జైలుకు వెళ్లిన తర్వాత ఎక్కువగా ప్రజల గురించే ఆలోచిస్తానని పేర్కొన్నారు. ఢిల్లీ ప్రజలకు అందుతున్న సేవల్లో ఎలాంటి మార్పు ఉండదని హామీ ఇచ్చారు. మీకోసం ఓ కొడుకులా పని చేశానన్నారు. ప్రజలను తాను అభ్యర్థించేది ఒక్కటేనని... అనారోగ్యంతో ఉన్న తన తల్లిదండ్రుల్ని జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు.



## సజ్జల పై కేసు నమోదు...

**అమరావతి :** ఏపీలో సార్వత్రిక ఎన్నికల వేళ వందల సంఖ్యలో కేసులు నమోదవుతున్న సంగతి తెలిసిందే. ఈ సమయంలో తాజాగా వైసీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామృష్ణారెడ్డిపై కేసు నమోదైంది. టీడీపీ ఫిర్యాదు మేరకు తాడేపల్లి పోలీసులు 153, 505, 125 సెక్షన్ల కింద కేసు పెట్టారు. దీంతో ఈ వ్యవహారం చర్చనీయాంశం అయ్యింది. ఈ సందర్భంగా పలు రకాల కామెంట్లు తెరపైకి వస్తున్నాయి. వైసీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిపై కేసు నమోదైంది. కౌంటింగ్ ఏజెంట్లపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ నేతలు దేవినేని ఉమా, గూడపాటి లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు ఆయనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు మొదలు పెట్టారు. ఈ సందర్భంగా సజ్జల వ్యాఖ్యలపై రెండు వెర్షన్స్ హల్ చల్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా... వైసీపీ కేంద్ర కార్యాలయంలో కౌంటింగ్ ఏజెంట్ల అవగాహన సదస్సులో పాల్గొని సజ్జల మాట్లాడారు. ఈ సందర్భంగా... మన టార్గెట్ ఇదీ అని దృష్టిలో పెట్టుకుని... దానికి అవసరమైనవి తెలుసుకోవాలి. అవతలివారు అడ్డం పడకుండా వారిని ఆపేందుకు ఏవేం నిబంధనలు ఉన్నాయో చూసుకోవాలి. మనవి ఒక్క ఓటు కూడా చెల్లనివిగా చేసే పరిస్థితి రాకుండా అడ్డుకునేందుకు ఏం చేయాలో చూసుకోవాలి.. అని అన్నారని అంటున్నారు. ఇదే సమయంలో... మనకు అనుకూలంగా, అవతలివాళ్ల ఆటలు సాగకుండా రూల్ ని ఎలా చూసుకోవాలి? అవసరమైతే దానికోసం ఎంతవరకు ఫైట్ చేయాలనేది నేర్చుకుందాం. ఇందులో కౌంటింగ్ ఏజెంట్ తనవంతు పాత్ర పోషించేలా వారి మెదడులోకి మీరు బాగా ఎక్కించాలి. పొరపాటున ఒకటి మనం వాదించినా పర్లేదు.. కానీ, రూల్ కాదేమో అని వెనక్కి తగ్గేవాడైతే ఏజెంట్ గా వద్దు అని సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు అనేది టీడీపీ ఫిర్యాదు! మరోపక్క ఎన్నికల కౌంటింగ్ రోజు ఏజెంట్లకు పలు సూచనలు చేసే క్రమంలో సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యల్ని ఒకవర్గం మీడియా వక్రీకరించిందని వైసీపీ నేతలు చెబుతున్నారు. ప్రత్యర్థి వర్గాన్ని నిలువరించాలంటే అప్రమత్తంగా ఉండాలని ఆయన వ్యాఖ్యానిస్తే... దీన్ని వక్రీకరించి రూల్స్ బ్రేక్ చేయాలని సజ్జల చెప్పినట్టుగా ప్రచారం జరిగిందని.. ఎడిటింగ్ వీడియోలను ఒకవర్గం మీడియా ప్రసారం చేసిందని అంటున్నారు.



## ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా ఏబీవీ

- ఐదేళ్ల తర్వాత మళ్లీ పోస్టింగ్‌లోకి ఏబీ వెంకటేశ్వరరావు
- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం
- సాయంత్రం పదవీ విరమణ చేసిన ఏబీవీ

**అమరావతి :** మొత్తానికి సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు పోరాటం ఫలించింది. తాజాగా ఆయనకు పోస్టింగ్ ఇస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా ఆయనను నియమిస్తూ కొద్దిసేపటి క్రితం ఉత్తర్వులు జారీచేసింది. హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ ఉదయం ఆయనపై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం ఆ తర్వాత కాసేపటికే పోస్టింగ్ ఇచ్చింది. గతంలోనూ ఆయనకు అదే పోస్టింగ్ ఇచ్చిన ప్రభుత్వం తాజాగా మళ్లీ అదే పోస్టులో నియమించడం గమనార్హం. చార్జ్ తీసుకున్న వెంటనే పదవీ విరమణ చేశారు.

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏబీవీపై సస్పెన్షన్ వేటు పడింది. రక్షణ వ్యవహారాల పరికరాల కొనుగోలులో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేసింది. దీనిపై ఆయన క్యాట్‌ను ఆశ్రయించగా సస్పెన్షన్‌ను సమర్థించింది. ఆ తర్వాత హైకోర్టు, సుప్రీంకోర్టును కూడా ఆయన ఆశ్రయించారు. చివరికి ఐదేళ్ల తర్వాత ఇప్పుడు ఆయనపై విధించిన సస్పెన్షన్‌ను క్యాట్ ఎత్తివేసింది. దీనిపై ఏపీ ప్రభుత్వం హైకోర్టుకు వెళ్లగా, క్యాట్ ఉత్తర్వులను సమర్థిస్తూ ఉన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. దీంతో ఏబీవీని విధుల్లోకి తీసుకున్న ప్రభుత్వం.. ఆ వెంటనే ప్రింటింగ్ అండ్ స్టేషనరీ డీజీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

## 'జగన్ గెలుపుపై హైకమాండ్‌కు షర్మిల నివేదిక - ఫుల్ క్లారిటీ..!!

**అమరావతి:** ఎన్నికల్లో హోరాహోరీగా పోరాటం చేసిన ప్రధాన పార్టీలు గెలుపు పైన ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ఎగ్జిట్ పోల్స్ పైన భారీ అంచనాలు ఉన్నాయి. జూన్ 4న ఎన్నికల పలితాలు వెల్లడి కానున్నాయి. జాతీయ స్థాయిలోనూ ఏపీ ఫలితాల పైన ఆసక్తి కనిపిస్తోంది. బీజేపీ తో టీడీపీ, జనసేన జత కట్టటంతో..జగన్ గెలిచే ఎంపీ సీట్ల పైన కాంగ్రెస్ ఆరా తీస్తోంది. పీసీసీ నుంచి నివేదిక కోరింది. ఏపీలో జగన్ గెలిచే సీట్ల పైన కాంగ్రెస్ నాయకత్వానికి పంపిన నివేదికలో కీలక అంశాలు ఉన్నట్లు సమాచారం. రాష్ట్రంలోని 25 ఎంపీ సీట్లలో ఎవరు ఎక్కువ సీట్లు గెలుస్తారనే చర్చ మొదలైంది. జగన్ మెజార్టీ ఎంపీ సీట్లు గెలిచినా..బీజేపీకి మద్దతిచ్చే అవకాశం ఉండదని కాంగ్రెస్ నేతలు అంచనా వేస్తున్నారు. ఎన్డీఏ కూటమిలో టీడీపీ ఉండటంతో..జగన్ స్వతంత్రంగానే ఉండే ఛాన్స్ ఉందని అంచనా వేస్తున్నారు. జగన్ వైపే సానుకూలత ఉందని నివేదించినట్లు విశ్వసనీయ సమాచారం. జగన్ కాంగ్రెస్ కు మద్దతిచ్చే అవకాశం కనిపించటం లేదని ఆ నేత ఢిల్లీ ముఖ్యులకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. అదే సమయంలో కడపలో షర్మిల ప్రభావం పైనా ఆరా తీసారని చెబుతున్నారు. దీంతో..ఫలితాల్లో జగన్ గెలిచే ఎంపీ సీట్ల ఆధారంగా ఢిల్లీలో కీలక నిర్ణయాలు జరిగే అవకాశం కనిపిస్తోంది.

# కూటమిదే అధికారమా..!?

### సైలెంట్‌గా బాబు అందుకేనా



**అమరావతి :** టీడీపీ అధినేత చంద్రబాబు చాలా సైలెంట్ గా తన పని తాను కానిచ్చేస్తున్నారు అని ప్రచారం సాగుతోంది. ఏపీలో ఎన్నికలు జరిగిన తీరు పోలింగ్ సరళి పోస్ట్ పోల్ సర్వేలు తనకు ఉన్న అంచనాలు ఇలా అన్నింటి మీద చంద్రబాబుకు పూర్తి అవగాహన ఉందని అంటున్నారు. ఆరు నూరు అయినా ఈసారి అధికారం మార్పు తథ్యమని బాబు భావిస్తున్నారుట. అంతే కాదు టీడీపీ కూటమి చాలా కంఫర్టబుల్ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని ఆయన లెక్కలు వేసుకుంటున్నారుట. ఇక సోలోగానే టీడీపీకి మెజారిటీ రావచ్చు అన్నది బాబుకు ఉన్న అంచనాలు అని చెబుతున్నారు. మరో వైపు చూస్తే చంద్రబాబు ఏ మాత్రం కంగారు పడకుండా చాలా నెమ్మదిగా ఉన్నారు. వార్ వన్ సైడ్ అయిందని బాబు గట్టిగా నమ్ముతున్నారని తెలుస్తోంది. ఆయన సీఎం గా తన ప్రమాణ స్వీకారానికి ప్రిపరేషన్ చేసుకుంటున్నారు అని అంటున్నారు. చంద్రబాబు సీఎం గా తన తొలి ప్రసంగాన్ని కూడా సిద్ధం చేసుకుంటున్నారు అని అంటున్నారు. అంతే కాదు తన ప్రమాణ స్వీకారానికి ఎవరెవరిని పిలవాలన్నది కూడా బాబు లిస్ట్ రెడీ చేసుకుంటున్నారు అని అంటున్నారు. వీలు అయితే ప్రధాని నరేంద్ర మోడీ లేకపోతే అమిత్ షాను పిలవాలని బాబు డిసైడ్ అయ్యారని చెబుతున్నారు. జూన్ 9న మంచి ముహూర్తం ఉందని పండితులు చెబుతున్నారు. అలాగే ఆ తరువాత ముహూర్తాలు కూడా చూస్తున్నారు. మొత్తానికి ఈ విషయంలో కూడా పండితులతో టీడీపీ పెద్దలు చర్చలు జరుపుతున్నారుట. అదే విధంగా అమరావతి లోనే చంద్రబాబు సీఎం గా ప్రమాణం చేస్తారని అంగరంగ వైభవంగా ఆ ప్రమాణ స్వీకార ఘట్టం ఉంటుందని అంటున్నారు. ఇక సీఎం గా చంద్రబాబు ప్రమాణ స్వీకార మహోత్సవ ఘట్టంలో పాల్గొనే ముఖ్య అతిథుల జాబితాలో తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ పేరు కూడా ఉందని అంటున్నారు. ఈ అతిథులను ఆహ్వానించే బాధ్యతలను పార్టీలోని కొందరు ముఖ్యులకు బాబు అప్పగించారు అని అంటున్నారు. మరో వైపు చూస్తే సీఎంగా ప్రమాణం చేయడానికి అధికారులతో సంప్రదింపులకు ఒక కీలక నేతకు బాబు బాధ్యతలు అప్పగించారని అంటున్నారు. ఇక చంద్రబాబు ఈసారి తన పాలనలో కొత్తదనాన్ని కూడా చూపించాలని ఆత్రపడుతున్నారు అని అంటున్నారు. తనను కలిసేందుకు వచ్చిన వారికి ఆయన ఇదే విషయం చెబుతున్నారుట. చంద్రబాబు ఈసారి తన మంత్రివర్గాన్ని జగన్ తరహాలో రెండు విడతలుగా విస్తరిస్తారు అని అంటున్నారు. రెండున్నరేళ్ల తరువాత పాతవారిని పక్కన పెట్టేసి వారి ప్లేస్ లో మరింతమంది ఆశావహులను తీసుకుంటారు అని అంటున్నారు. దీని వల్ల ఎక్కువ మందికి క్యాబినెట్ బెర్త్ ని ఇచ్చేందుకు వీలు అవుతుందని బాబు ఆలోచిస్తున్నారు అని అంటున్నారు.

అదే విధంగా సైన్‌మెంట్ ల్యాండ్ చట్టాన్ని రద్దు చేస్తూ చంద్రాబాబు తొలి సంతకం చేస్తారు అని అంటున్నారు. అంటే బాబు ప్రమాణ స్వీకారం వేదిక అతిథుల లిస్ట్, మంత్రి వర్గం కూర్పు తొలి సంతకం ఇలా చాలా జోరుగానే తెర వెనక కసరత్తు చేస్తున్నారు అని అంటున్నారు. ఇంతలా బాబులో ధీమాను చూసిన వారు తప్పకుండా టీడీపీ అధికారంలోకి వస్తుంది అని నమ్ముతున్నారు. దాంతో ఈసారి మనదే పవర్ అని తమ్ముళ్ళు సంబరాలు చేసుకుంటున్నారు.

# బీజేపీలో ఆధిపత్య పోరు!!

### బీజేపీ - ఆరెస్సెస్ మధ్య విభేదాలు ముదిరి పాకాన పడుతున్న వైనం



**న్యూఢిల్లీ :** ప్రస్తుతం దేశవ్యాప్తంగా లోక్ సభ ఎన్నికల సందడి కొనసాగుతుంది. ఈ క్రమంలో జూన్ 1న జరగబోయే ఏడో విడత పోలింగ్ తో ఎన్నికలు ముగియనున్నాయి. ఆ సంగతి అలా ఉంటే... ఈసారి కూడా అధికారం తమదే అని బీజేపీ నేతలు గట్టిగా చెబుతున్నారు. అయితే... అదంతా మోడీ క్రెడిట్ మాత్రమే అని.. ఆరెస్సెస్ పాత్ర అత్యల్పం అన్నట్లుగా బీజేపీలోని ఒక వర్గం నుంచి కామెంట్లు వినిపిస్తున్నాయని అంటున్నారు. ఇప్పటికే ఆరెస్సెస్ అనేది ఆధ్యాత్మిక సంస్థ.. బీజేపీ అనేది రాజకీయ సంస్థ.. ఇక్కడ రాజకీయంగా బీజేపీ సాధించే విజయాలన్నీ మోడీ – షా ద్వయం ఫలితమే అనే కామెంట్లూ తెరపైకి వస్తున్నాయని అంటున్నారు. ఈ సమయంలో భారతీయ జనతా పార్టీలో ఆధిపత్య వైఖరి నివురుగప్పిన నిప్పులా ఉందని... ఎన్నికల ఫలితాల అనంతరం ఇది బయటపడే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయనే టైపులో కథనాలు జాతీయ మీడియాలో తెరపైకి వస్తున్నాయి! అవును... భారతీయ జనతాపార్టీలో ఆధిపత్య వైఖరి నివురుగప్పిన నిప్పులా ఉందని.. ఎన్నికల అనంతరం అది బయటకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఈ వ్యవహారం ప్రధానంగా... మోడీ – షా వర్సెస్ నితిన్ గడ్కరీ గా సాగుతుందని కథనాలొస్తున్నాయి. ఇందులో భాగంగానే నాగపూర్ లో గడ్కరీని ఓడించడానికి మోడీ, షాలు ప్రయత్నించారని.. ఆయనకు అనుకూల వర్గంగా ఉన్న 1.5 లక్షల ఓట్లను జాబితాలో మాయం చేశారనే ఆరోపణలూ తెరపైకి వస్తున్నాయి. దీనికి తోడు ఎన్నికల సమయంలో నితిన్ గడ్కరీకి మద్దతుగా అటు మోడీ కానీ, ఇటు అమిత్ షా కానీ ఎలాంటి ప్రచారం చేయలేదు సరికదా... బీజేపీ స్టార్ క్యాంపెయినర్ల జాబితా నుండి గడ్కరీ పేరును తీసి పక్కనపెట్టిన పరిస్థితి అని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని.. నెక్స్ట్ స్టెప్ కు రంగం సిద్ధం చేసుకుంటున్నారంట గడ్కరీ! పైగా... బీజేపీకి ఆరెస్సెస్ అవసరం లేదని నడ్డా, అమిత్ షా వ్యాఖ్యానించారనే చర్చ రచ్చ రచ్చగా మారిన పరిస్థితి. నితిన్ గడ్కరీ ఆరెస్సెస్ కి దగ్గర మనిషి కాబట్టే ఈ తరహా కామెంట్లు చేశారని కూడా అంటున్నారు. దీంతో... పరిస్థితి ముదిరి పాకానపడిందని గ్రహించారో ఏమో కానీ... ఈ వ్యవహారంపై ఆరెస్సెస్ కీలక నేతలతో గడ్కరీ సంప్రదింపులు జరిపినట్లు చెబుతున్నారు. అయితే... గడ్కరీ కూడా ఎక్కడా తగ్గడం లేదు! ఇందులో భాగంగా బీజేపీలో మోడీ – షాల ఆధిపత్య వైఖరిని అవకాశం వచ్చినప్పుడల్లా ఎండగడుతూ వస్తున్నారని అంటున్నారు. ఇందులో భాగంగానే 2022లో పాలనలో లోపాల మీద సొంత సర్కారుపైనే గడ్కరీ విరుచుకుపడటంతోపాటు... వాజ్ పేయి, అద్వానీ, దీన్ దయాళ్ ల కృషి వల్లే నేడు బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తున్నారు. ఈ స్థాయిలో పరిస్థితులు మారిపోయాయని.. భారతీయ జనతాపార్టీలో ఆధిపత్య వైఖరి ముదిరి పాకానపడిందని.. మరి ఎన్నికల ఫలితాల అనంతరం ఆ పార్టీలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో వేచి చూడాలని అంటున్నారు పరిశీలకులు.

### సచివాలయంలో మంత్రుల పేషీలు
# ఛాంబర్లు స్వాధీనానికి ఏర్పాట్లు

**అమరావతి బ్యూరో, జర్నలిస్ట్ ఫైల్**

**3వ తేదీ సాయంత్రంలోగా మంత్రులు తమ చాంబర్లు ఖాళీ చేయాలని సర్కారు ఉత్తర్వులు**

**మరో వారం తర్వాత కొలువు దీరనున్న కొత్త మంత్రివర్గం..**

**ఎవరికి ఏ చాంబర్ రాసిపెట్టి ఉందో ఎవరికి ఎరుక..**

అధికారం ఒక అందం. అది ఒక దర్జా. రాజభోగం. అది లేని నాడు ఇబ్బందే. మంత్రి పదవి కావాలని ఎవరైనా ఎందుకు కలకు కంటారు అంటే దాని కోసమే. అటువంటి అధికారాంతమున అయ్యవారి మోము చూడవలె అని ఒక పాత సామెత కూడా ఉంది. ఏపీలో చూస్తే వైసీపీ ప్రభుత్వం అధికారం తుది ఘడియలకు చేరుకుంది. మరో సారి వైసీపీ గెలిస్తే కొత్తగా ప్రమాణం చేయవచ్చు. మంత్రులుగా కొత్తవారు చేరవచ్చు. కానీ ప్రస్తుతం జగన్ తో పాటుగా ఉన్న పాతిక మంది మంత్రులకు మాత్రం ఈ టెర్మ్ తో రుణం తీరినట్లే అని అంటున్నారు. ఇందులో మళ్లీ ఎంత మంది గెలిచి అసెంబ్లీకి వస్తారు. వైసీపీ గెలిస్తే వారిలో ఎంతమందికి తిరిగి మంత్రి పదవులు కట్టబెడతారు అన్నది మాత్రం చాలా లెక్కల మీద ఆధారపడి ఉంటుంది. అలాగే లక్కు మీద కూడా ఆధారపడుతుంది. దీంతో ఏపీలో ఉన్న మంత్రులు అంతా అధికార హోదా అనుభవించిన చాంబర్లకు వీడుకోలు పలకాల్సిన సమయం ఆసన్నమైనట్లే అంటున్నారు. జూన్ 3 వ తేదీ సాయంత్రం లోగా మంత్రులు అంతా తమ చాంబర్లను అప్పగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీని ప్రకారం మంత్రులు అంతా తమ చాంబర్లతో పాటు ప్రభుత్వం ఇచ్చిన సహాయకులను కూడా తిరిగి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది అని అంటున్నారు. అంతే కాదు ఈ చాంబర్ల నుంచి ఎటువంటి ఫైల్స్ కానీ అలాగే ఇతర సామగ్రి కానీ తరలించడం మీద కూడా నిషేధం విధించినట్లుగా చెబుతున్నారు. అంతే కాదు సచివాలయంలో తమ అనుమతి లేకుండా ఎలాంటి పత్రాలు అలాగే స్టేషనరీ ఫైల్స్ ని కూడా తీసుకెళ్ల రాదని స్పష్టం చేశారు. అదే విధంగా ఎలాంటి వస్తువులను కూడా తీసుకెళ్ళడం కుదరదు అని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఇక సచివాలయానికి వచ్చే ఆయా వాహనాల తనిఖీలు కూడా చేపట్టాలని కోరారు. ఈ మేరకు సచివాలయం సెక్యూరిటీ చూసే ఎస్పీఎఫ్ ని ప్రభుత్వం ఆదేశించింది. మొత్తం మీద చూస్తే జూన్ 4న కౌంటింగ్ జరిగి ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడబోతోంది. అందువల్ల పాత ప్రభుత్వంలో పనిచేసిన మంత్రులకు జూన్ 3 చివరి రోజు కాబోతోంది అని అంటున్నారు. ఆ రోజుతో సచి వాలయంలో తమ చాంబర్లకు వారు గుడ్ బై కొట్టాల్సిందే అంటున్నారు. మరి ఏపీలో ఏ ప్రభుత్వం వస్తుందో ఎవరు మంత్రులు అవుతారో ఎవరికి ఈ చాంబర్లు కేటాయిస్తారో ఇవన్నీ రానున్న రోజులలో తేలుతుంది. సెంటిమెంట్ గా చేసుకుని కొంతమంది మంత్రులు తమకు ఇష్టమైన చాంబర్లను ఎంచుకున్నారు. మరి కొందరు తమ చాంబర్లను అందంగా డిజైన్ చేయించుకున్నారు. ఇపుడు వాటి కి టాటా వీడుకోలూ అని పాడుతూ బరువెక్కిన హృదయంతో ఇంక సెలవ్ అని చెప్పాల్సిందే అంటున్నారు.



## మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్

**జగన్, బాబు, పవన్ లకు మాజీ జేడీ రిక్వెస్ట్!**

**అమరావతి :** ప్రస్తుతం ఆంధ్ర – తెలంగాణ రాష్ట్రాలకు హైదరాబాద్ అనేది ఉమ్మడి రాజధాని అనే సంగతి తెలిసిందే. అయితే జూన్ 2తో ఈ విషయం పరిసమాప్తమవ్వబోతోంది. జూన్ 2 నుంచి హైదరాబాద్ కేవలం తెలంగాణ రాష్ట్రానికి మాత్రమే రాజధానిగా ఉండబోతుంది! అయితే ప్రస్తుతానికి ఏపీకి రాజధాని లేని నేపథ్యంలో... ఆసక్తికరమైన చర్చ తెరపైకి వచ్చింది. ఏపీకి ఇంకా శాశ్వత రాజధాని లేనందువల్ల హైదరాబాద్ ని మరికొన్నేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా పొడిగించాలని ఇటీవల వైసీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. ఈ సమయంలో మరోసారి ఉమ్మడి రాజధాని చర్చ తెరపైకి వచ్చింది. ఇదే సమయంలో... తాజాగా సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ ఇదే విషయం మరోసారి ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. మరో 10 ఏళ్ల పాటు హైదరాబాద్ ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాల్సిన అవసరం ఉందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. 2014 జూన్ 2వ తేదీన చోటు చేసుకున్న ఏపీ విభజన తర్వాత ఈ 10 సంవత్సరాల వ్యవధిలో రాష్ట్రానికి రాజధాని అనేది లేకుండా పోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అందుకే మరో 10 ఏళ్ల హైదరాబాద్ ఉమ్మడి రాజధానిగా కొనసాగించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ క్రమంలో మరోసారి తాజాగా ఎక్స్ వేదికగా స్పందించారు మాజీ జేడీ. ఇందులో భాగంగా... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ల ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ ను మరికొన్నేళ్లు పొడిగించాలనే డిమాండ్ చేయాలని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ కోరారు. ఈ అంశాన్ని ఏపీలోని అన్ని రాజకీయ పార్టీలూ లేవనెత్తాలని కోరారు. ఇదే సమయంలో... ఏపీలో పునర్వ్యవస్థీకరణ చట్టం 2014లోని సెక్షన్ 5 ప్రకారం ఉమ్మడి రాజధాని పొడిగింపుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా... ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్, ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిళను ఎక్స్ లో ట్యాగ్ చేస్తూ ఆయన ట్వీట్ చేశారు.



## కంటైనర్ల నిలిపివేత

**ఫలితాల వేళ అమరావతి కేంద్రంగా అనూహ్య నిర్ణయం..!!**

**విజయవాడ :** ఏపీలో ఎన్నికల ఫలితాల వేళ కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలు ఏపీలో ఎన్నో అంశాల పైన క్లారిటీ ఇవ్వనున్నాయి. గెలుపు పైన పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నా..లోలోపల మాత్రం టెన్షన్ కొనసాగుతోంది. అయిదేళ్ల కాలంగా కొనసాగుతున్న రాజధాని వివాదంకు ముగింపు లభించే ఛాన్స్ ఉంది. ఇదే సమయంలో అమరావతి కేంద్రంగా పలితాల ముందు ఆసక్తి కర అంశాలు వెలుగు లోకి వస్తున్నాయి. అమరావతిలో అయిదేళ్లుగా సాగుతన్న పరిణామాలకు భిన్నంగా కీలక అంశం చోటు చేసుకుంది. రాజధాని ప్రాంతం నుంచి నిర్మాణ సామగ్రి తరలింపు వ్యవహారంపై ఎట్టకేలకు సీఆర్డీఏ స్పందించింది. అమరావతి నుంచి తరలిస్తున్న సామగ్రిని సీఆర్డీఏ అధికారులు అడ్డుకున్నారు. ఎల్ అండ్ టీ స్టాక్ యార్డ్?లో సీఆర్డీఏ ఇంజినీరింగ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సదరు కంటైనర్ వాహనంలో ప్లాస్టిక్ స్పేసర్స్ తరలింపును గుర్తించిన అధికారులు వాటిని అడ్డుకున్నారు. సీఆర్డీఏకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా సామగ్రిని తరలించడం పట్ల సంబంధిత గుత్తేదారు సంస్థకు నోటీసులు జారీ చేసినట్టు సీఆర్డీఏ తెలిపింది. ఇకపై అమరావతి ప్రాంతంలో నిర్మాణాలకు ఉద్దేశించిన సామగ్రి తరలింపునకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయని గుత్తేదారు సంస్థలకు సీఆర్డీఏ స్పష్టం చేసింది. వైఎస్సార్సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పనులు నిలిచిపోయాయి. అప్పటి నుంచి సామగ్రి అంతా నిరుపయోగంగా ఉంది. ఎన్నికల తరువాత ఎల్ అండ్ టీ నిల్వ కేంద్రం నుంచి సామగ్రిని తరలిస్తున్నారన్న సమాచారం తెలుసుకున్నరైతులు అక్కడికి చేరుకున్నారు. భారీ కంటైనర్లలో రాజధాని నుంచి ఎందుకు తరలిస్తున్నారని సంస్థ ప్రతినిధులను ప్రశ్నించారు. కొద్ది రోజుల్లో ఎన్నికల ఫలితాలు రానున్నందున, అప్పటి వం-కు అయినా ఆగాలని కోరారు. ప్రస్తుతానికి తరలింపును నిలిపివేయాలని ప్రాథేయపడ్డారు. అమరావతి నిర్మాణానికి ఆటంకం కలిగించొద్దని వేడుకున్నారు. అమరావతి నిర్మాణం కోసం తీసుకు వచ్చిన సామగ్రిని గుత్తేదారు సంస్థలు తరలింపుపై ప్రభుత్వం స్పందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల తరువాత కొత్త ప్రభుత్వంలో రాజధాని అంశం పైన ఒక స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది.

జర్నలిస్ట్ ఫైల్

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా..
సంప్రదించండి - 7661805968

అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు...
సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467